# చిత్రకళాప్రదర్శన

(పది సంగీత నృత్య నాటికల సంపుటి)

బోయి భీమన్న

సుఖేలా నికేతనం

హైదరాబాదు

సుఖేలా నికేతనం,
మూడవ పుష్పం
1963

ముద్రణ:
దక్షిణ భారత ప్రెస్సు
హైదరాబాదు – 4

ప్రతులకు:
సుఖేలా నికేతనం
92/2, ఆర్. టి. విజయనగర కాలనీ
హైదరాబాద్

హక్కులు రచయితవి

వెల రూ :4/–

## మా విషయం

మా సుఖేలానికేతనం కేవలం సాహిత్యాభిరుచితో పెంచుకొంటున్న సారస్వ తోద్యానంలో వికసించిన నాలుగవ కుసుమం ఈ 'చిత్రకళా ప్రదర్శన'. ఇంత వరకు వెలువడినట్టివి 'త్రిపదలు', 'మానవుని మరొక మజిలీ', 'ప్రకృతిలో మానవ ప్రకృతి'. ఇప్పటి ఈ చిత్రకళా ప్రదర్శన గురించి చెప్పే ముందు మా సంస్థ గురించి నాలుగు మాటలు చెప్పడం అవసరమని భావిస్తున్నాం.

మా సుఖేలా నికేతనం స్థాపించబడి అయిదారేళ్ళయినప్పటికీ అది వ్యవస్థీకరించబడత 1960లో. శ్రీ బోయి భీమన్నగారి గేయ కావ్యం "పైరుపాట" సంగీత నృత్య నాటికగా ప్రదర్శించబడడంతో ఈ సంస్థ వెలుగులోకి వచ్చింది.

1960 సెప్టెంబరు మాసంలో, స్వర్గీయ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షత క్రింద జరిగిందా ప్రదర్శనం. అదే సమయంలో ఏ తత్కావ్యకర్త అయిన శ్రీ బోయి భీమన్నగారికి సన్మానం జరిపి, ఒక సన్మాన సంచికను కూడ వెలువరించి సమర్పించిందాయనకు. డా. దివాకర్ల వెంకటావధాని గారి ప్రధాన సాహిత్యోపన్యాసంతో, విధాన సభాధ్యక్షులు శ్రీ కాళేశ్వర రావుగారి శుభాకాంక్షలతో, తదనంతర ప్రదర్శనా సమంచితాలైన రమణీయ నృత్య సంగీతాలతో ఆనాటి కార్యక్రమం సహృదయ హృదయ రంజకమ్మై, సమస్త సదస్య సమాహ్లాదకమ్మై ఒప్పారిందన్నది జనవాక్యం.

ఆనాటి నుంచి, ఆనాటి విజయంనుంచి లభించిన ప్రోత్సాహ ప్రేరణల బలంతో, మా సంస్థ నృత్య సంగీత కార్యక్రమాలలో ఇతోధికమైన శ్రద్ధాసక్తులను ప్రదర్శించసాగింది. 'పైరుపాట'ను అప్పుడప్పుడు అక్కడక్కడా ప్రదర్శించుకుంటూ, రవీంద్రుని శత జయంతి ఉత్సవాల నాటికి 'చాండాలిక'ను నృత్య నాటికగా రూపొందించింది. ఆ తరువాత గురజాడ శతజయంతి సందర్భంలో 'కన్యక' సంగీత నృత్య రూపకంగానే నిర్మించబడింది. ఎగ్జిబిషను థియేటరులో 'చాండాలిక' ప్రదర్శన, రవీంద్ర భారతిలో 'కన్యక' ప్రదర్శన అపారంగా ప్రేక్షకుల మన్ననలను పొందినాయి.

సంగీత నృత్య నాటక ప్రదర్శనల ద్వారా కేవలం ఒకే రంగానికి కట్టుబడి వుండడం కంటె, వాస్తవ సాహిత్య రంగానికి కూడ కొంత సేవచేయాలన్న నిర్ణయానికి వచ్చి, సాహిత్య గ్రంథ ప్రచురణకు కూడ ఈ సంస్థ పూనుకొన్నది. సంగీత, సాహిత్య,

నృత్య, చిత్రకళా రంగాలన్నిటికీ తన కార్యక్రమాన్ని విస్తరింపచేయాలన్నది యీ సంస్థ ఆకాంక్ష. ఏతత్కళా స్రష్టలను ప్రోత్సహించాలని, సృజనాత్మక సాహిత్యాన్ని వెలయింప చేయాలని, సార్వజనిక శ్రేయానికి మూలభూతమైన సాహితీ సంస్కృతుల ద్వారా భరత మాతను సేవించాలని మా చిరంతనాభిలాష. ఈ మా లక్ష్యసిద్ధి ప్రజల ఆదరాభిమానాలపై ఆధారపడి వున్నది.

ఈ ప్రస్తుత నాటికా సంపుటిలో పది నాటికలున్నాయి. అవన్నీ నృత్య సంగీత రూపకాలుగా నిర్మించడానికి అనువైనట్టివే. రంగ స్థలాన్ని, ప్రేక్షక జనాన్ని దృష్టిలో వుంచుకుని వ్రాయబడినట్టివే. ఇవన్నీ శ్రీ బోయి భీమన్నగారి స్వతంత్ర రచనలే. ఇందులో రెండు నాటికల యితి వృత్తాలు మాత్రం పూర్వ చరిత్రల నుంచి చేకొనబడినట్టివి. అందులో 'దేవయాని' కథ మహా భారతము నుంచి తీసుకొనబడగా, 'చాండాలిక' కథ రవీంద్రుని రచన నుంచి స్వీకరించబడింది. 'అంధకారంపై విజయం' కూడ నరకాసుర వధను అనుసరించిందే అయినా, అది ప్రస్తుత భారతోత్తర సీమారేఖపై దురాక్రమణకు, ఏతత్ప్రతిఘటనలో భారత యువజనతా దిగ్విజయానికి కేవలం ప్రతీక.

ఈ నాటికల సంపుటి తమ సోదరీ ప్రాయ అయిన స్వర్గీయ శ్రీమతి ఆదిలక్ష్మి ఎం.ఏ., ఎం.లిట్ గారికి అంకితమివ్వబడింది. రష్యాలోని లెనినుగ్రాడు యూనివర్సిటీలో ప్రాచ్య భాషా (తెలుగు, తమిళము) ప్రొఫెసరుగా వుంటూ, ఆంధ్ర భారతి ప్రతిభా ప్రాభవాలను విదేశాల నిండా వెదజల్లుతూ, అక్కడే బాలెంత జబ్బుతో స్వర్గస్థురాలైన ఆంధ్ర విదుషీమణి శ్రీమతి ఆదిలక్ష్మి. ఈ సందర్భంలో కృతికర్త ప్రదర్శించిన ఉదాత్త సౌదర్యభావం ఆదర్శప్రాయమైనది, అభినందనీయమైనది.

ముఖచిత్రం వ్రాసి పెట్టిన ఆర్టిస్టు శ్రీ పి. ఆర్. రాజు గారికి, అందంగా ముద్రణ పని జరిపిన దక్షిణ భారత ప్రెస్ వారికి కృతజ్ఞతలు.

మధుర కవితా సౌరభ భరితమైన మా యీ ప్రఫుల్ల కుసుమం రసజ్ఞులను అలరింపచేయగలదని మా విశ్వాసం.

శోభకృత్ ఉగాది
హైదరాబాదు

నమస్సులతో
సుఖేలా నికేతనం

## అంకితం

# సోదరి ఆదిలక్ష్మికి

స్టెల్లామేరీస్ కాలేజీలో బి.ఏ. క్లాసుకు ''మధుబాల'' కావ్యం పాఠం చెబుతూ, నన్ను మీ అన్నయ్యగా దత్తత చేసుకొన్న చెల్లీ!

''మాల వాళ్లంటే ఏమిటో అనుకునేదాన్ని! మీలా వుంటారని వూహించ లేదన్నయ్యా! నిజానికి మా బ్రాహ్మణ స్త్రీలు అంత కన్సర్వేటివుగా వుండటానికి కారణం వాస్తవ లోకజ్ఞానం లేకపోవడమే'' అంటూ, విశ్వమానవ ప్రగతి శీలకమైన పవిత్ర వాక్యాన్ని వేదవాక్యం వలె పలికిన తల్లీ!

''అన్నయ్యా'' అన్న మూడక్షరాలలో మూడు లోకాల సౌభ్రాత్రాన్ని నింపి, ''వదినా'' అన్న అక్షరత్రయంలో త్రిలోకాల సౌహార్దాన్ని ప్రపంచిస్తూ – వంట గదిలో చేరి, వదినెతో గంటల తరబడి కబుర్లు చెప్పే స్నేహరూపిణీ! ఆదిలక్ష్మి!

మాతృదేశ కీర్తి ప్రతిష్ఠలు విశ్వంనిండా వెన్నెల కాయడం కోసం విదేశాలకు వెళ్ళిన ఆంధ్ర భారతి గారాబు బిడ్డవు – ఇక తిరిగి రావా, ఇక మాకు లేవా, అమ్మా!

చంద్ర లోకాలకూ, సూర్యలోకాలకూ తిరుగు ప్రయాణం టికెట్లను అచ్చు కొడుతున్న భౌతిక మానవుడు, బాలెంత అయిన మా తల్లిని మాకు తిరిగి ఇవ్వలేని నిస్సహాయుడేనా, విదుషీమణీ!

''మనం ముగ్గురం'' అనుకొంటూ ఆనాడు నీవూ, వదినా, నేనూ తీయించు కొన్న ఈ ఫోటో ఇక శాశ్వతస్మృతి చిహ్నమేనా, సోదరీ!

గురువు విద్యారత్న, తల్లి రుక్మిణమ్మ, భర్త ఆంజనేయులు, మైథిలి, భారతి, జోగా, వదిన, నేను – అందరం గోడలమీద ఫ్రేములలో ఫోటోలమై నీ చుట్టూ వున్నా – మేం వున్నామనీ, నీవు లేవనీ అనిపిస్తున్నదేమిటి, ''పంచామృత'' వాగ్దేవీ?

నీ – నా వాగ్దేవీ సాదర్య తత్త్వానికి ఈ సంగీత నృత్య నాటికా గుచ్ఛం పూజా కదంబంగా స్వీకరించి, మన్నించమ్మా జనప్రియా!

రసాలిని
భాగ్యనగరం

–బోయి భీమన్న

* * *

## రంగరచన

చిత్రకళా ప్రదర్శనం ఒక భవనంలో ఏర్పాటు చేయబడింది. మన రంగం ఆ భవనం ముందుగల హాలు, హాలుమధ్య ప్రధానద్వారం భవనంలోకి కలదు. హాలు కుడికి, ఎడమకు కూడ ద్వారాలు కలవు. హాలులో కొన్న చిత్రాలు ప్రదర్శించబడి వున్నాయి. ప్రదర్శన ద్వారానికి ఒక ప్రక్కన నర్తకి చిత్రం, ఒక ప్రక్క మృదంగ వాద్యగాని చిత్రం నిలువెత్తు చిత్రాలలో బిగించబడి వున్నాయి. చిత్రాల పైని సన్నని తెరలు కలవు. వాటిగుండా లోని చిత్రాలు ప్రేక్షకులకు కనిపిస్తూ వుంటాయి. ఆ చిత్రాలను అవసరమైనప్పుడు చట్రాలనుంచి తొలగించడానికి, మంజీర పాత్రధారిణి, మార్దంగం పాత్రధారి ఆ చట్రాలలో చిత్రాలవలెనే నిలవడానికి ఏర్పాటుండాలి. అసలు చట్రాలలో చిత్రాలు అక్కర లేకుండానే, మంజీర, మార్దంగం పాత్రధారులు చిత్రాలవలె చట్రాలలో నిలబడవచ్చు. చట్రం దాటి వాళ్ళు వచ్చినప్పుడు చైతన్యం పొందిన చిత్రాలే ముందుకు వచ్చి నట్లుంటుంది.

చిత్రదత్తు చాలా నాజూకైన యువకుడు. కళ చిత్రంలోని నర్తకి కంటే అందమైంది. తరచు జనం హాల్లోని చిత్రాలను చూస్తూ మెచ్చుకొంటూ భవనంలోకి పోతూ వుంటారు. భవనం ముందుహాలే ఈ నాటికకు రంగస్థలం, చివర వ్రాసిన నేపథ్యగీతమే ప్రారంభం లోను, మధ్య మధ్యా వినిపిస్తూ వుంటుంది.

## ప్రదర్శన

(నేపథ్యంలో "మానవుని కానంద" అనే గీతం వినిపిస్తూ, తెర తొలగుతుంది. చిత్రకళా ప్రదర్శనం భవనం ముందుహాలు పూర్వ పద్ధతిలో కనిపిస్తుంది. ప్రదర్శిత కళా ఖండాలను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ "చిత్రదత్తు" ప్రవేశిస్తాడు)

## చిత్రదత్తు

ఓయి, స్నేహశీలి !
ఓయి, భావశాలి !
ఎడదగల మనుష్యుడా !
ఎదుగుతున్న తమ్ముడా !

రంగు రంగు తెరలలోకి
తొంగిచూడు మొకసారి !
ఇది కళా ప్రదర్శనమో !
ఇది జీవిత దర్శనమో !

ఇవిగో ఇవి తొలిగీతలు,
అవిగో అవి మలిరేఖలు,
తొలిగీతల దున్నలివి !
మలిరేఖల మధుపము లవి !

కుంచె వెనుక గుండెలోకి
పొంచిచూడు మొకసారి !
అసలు రంగు కదె పెట్టె !
అవనికి కుంకుమ బరిణె !

తెలుపు నలుపు మానవు లివి !
త్రివర్ణాల దేవత లవి !
పూల గుండెలలో మునిగి
తేలివచ్చిన రుచులివి !

శోభానిలయం లోనికి
చూపు మలుపు మొకసారి !
ప్రతి చిత్రం నిన్నొకింత
ప్రతి ఫలించి చూపునేమొ !

(చిత్రదత్తు తన చేతిలోని సూచికాదండంతో చిత్రాలకేసి చూపుతూ వుంటే, ఒక్కొక్కరు చూస్తూ ప్రధాన ద్వారం లోనికి నిష్క్రమిస్తూ ఉంటారు. ఎడమప్రక్క ద్వారం నుంచి కళ ప్రవేశిస్తుంది. హాలంతా ఒకసారి పరికించి మంజీర చిత్రాన్ని కొంచెం సేపు చూచి, మార్దంగం చిత్రం దగ్గర ఆగిపోతుంది. తర్వాత చిత్రదత్తును చూస్తుంది. చిత్రదత్తు చాలా సేపటినుంచీ తన కేసే చూస్తున్నాడు. ఇద్దరి చూపులు కలుస్తాయి. ఒక్క సారిగా సిగ్గుపడతాడు. ఆమె ముందు, అతడు వెనుక ప్రదర్శన ద్వారం గుండా నిష్క్రమిస్తారు. నేపథ్యంలో మద్దెల ధామ్మని మోగుతుంది. మంజీర చిత్రం కదులుతుంది. చిత్రంలోని మంజీర మానవరూపంలో ముందుకు వస్తుంది. మార్దంగం కూడ మానవ రూపంలో ముందుకు వస్తాడు.)

మంజీర :

ఎంత మోసం ! ఎంత మోసం !
ఎవతె వెంటో పోదువే ?
స్థాణువుగ నన్నిందె నిలిపీ
చంచలను ప్రేమింతువే ?

ధరణిలో నిన్ను మించిన సౌం
దర్యవతి లేదంటివే !
చిలిపి సీతాకోక చిలుకకు
చిత్తమున తావిస్తివే !

గుండె నెత్తురులోన ముంచి
కుంచె నడిపితి నంటివే !
కుంచె కందని కుర్రదెవతెకొ
కొంగు ముడివై పోతివే !

చిత్రలోకమునకే, సహృదయ

చిత్తములకే రాణి ననవే ?
చిత్రకళలకె దత్తుడా ?
చెదరెనే నీ చిత్కళా ?

(ఎవరో పిల్చినట్టుగా కుడిప్రక్కనుంచి చిత్రదత్తు, ఎడమప్రక్క నుంచి కళా ప్రవేశిస్తారు. అంతలోనే మంజీర మార్దంగం మానవ రూపం విడిచి చిత్రాలైపోతారు. చిత్రదత్తు, కళ ఒకరి నొకరు ప్రశ్నార్థకంగా చూచి కొంటారు.

**చిత్రదత్తు :**

ఎవరో నను పిలిచారు !
యువతీమణిరో, నీవా ?

కళ :

నన్ను కూడ పిలిచారు !
నవ్వులాట కాదు కదా ?

చిత్రదత్తు, కళ

**ఎవరో, మరి, పిలిచారు !**
**ఇద్దర్నీ పిలిచారు !**
**పేరుపెట్టి పలిచారు !**
**పీయూషం చిలికారు !**

(ఇద్దరూ ఇటూ, అటూ చూచి, చెరొకవైపుకు నిష్క్రమిస్తారు. నేపథ్యంలో గజ్జెలు ఘల్లున మ్రోగుతాయి. మార్దంగం చిత్రం కదులుతుంది. మార్దంగం మానవరూపంలో ముందుకు వస్తాడు. మద్దెలను టక టక వాయిస్తాడు. నిష్క్రమిస్తున్న కళకేసి చూస్తాడు. విరాళి కనపరుస్తాడు. మంజీర కూడ మానవ రూపంలో బైటికి వచ్చి అభినయం చేస్తుంది.)

మార్దంగం :

ఏమందం ! ఏమందం !
ఇలకే మధురానందం !
దివ్యలోక మందారం
దిగివచ్చిందో హో హో !

సకల కళా సౌందర్యం
చట్రంలో బిగించబడ,
సర్వజీవ సౌందర్యం
జవరాలై వచ్చెనొహో !

నిర్జీవపు గీతలలో
నిశ్చలమౌ రంగులలో
ఎంత మహిత చిత్రమైన
ఈడగునే ఒక కాంతకు ?

సహజకళను పట్టి తెచ్చి
చట్రము లోపల బిగించి,
జీవకళను వెంటాడే
చిత్రదత్తుడే ధన్యుడు !

(మళ్ళీ ఒక వైపునుంచి కళ, మరోవైపునుంచి చిత్రదత్తు ఆశ్చర్యంతో ప్రవేశిస్తారు. మంజీరా, మార్దంగం యథారీతి చిత్రాలైపోతారు.)

చిత్రదత్తు :

ఎవ్వరో నను విమర్శించుచున్నా రిందు !
నీవు కాదనుకొందు, నీరేజనయన !
కళను సృష్టింతునేగాని, చట్రములోన
బంధించి విడవైచు పండితుడగాను.

కళ :

నను కూడ నిందించినా రెవ్వరో యిచట !
నీవు కాదనుకొందు, నిర్మల కళాశీలి !
కమనీయమౌ చిత్రకళ కంటె, కేవలము
నరకాంత నేను యెవ్వరి దృష్టి మళ్లింతు ?

చిత్రదత్తు :

కేవలము నరకాంతవేనా ?
దేవ వన సుమ గుచ్ఛ మీవు !
నా కళా సర్వస్వమును నీ
నఖ పరాగము పోలునా ?

కళ :

వినయశీలుడ, వంతెకానీ,
విశ్వమోహిని నీదు శిల్పము !
ఎందరేన్ నా వంటి కన్యలు
ఈడె నీ ఒక రేఖకు ?

(నేపథ్యంలో సంగీతం, ప్రేక్షక సహృదయులు వస్తూ పోతూనే వుంటారు. సంగీతం వింటూ, కళా చిత్రదత్తులు కలిసి ప్రధాన ద్వారం ద్వారా లోనికి పోతారు. ధామ్మని మద్దెలా, గళ్మని గజ్జెలు మ్రోయగా మంజీర, మార్దంగం మానవ రూపాలతో రంగంలోకి దూకుతారు. నాట్యం చేస్తారు.)

మంజీర :

చూచినావుగా - మానవ మూర్తులు
సుందరములు, మధురములు !
పోల్చినావుగా - మానవ బుద్ధులు
మోహితములు, కృతకములు !

సౌందర్యమ్ముల ఉత్తమము కళా
సౌందర్యమె అని అంటారు !
ఎవతో, ఎవడో కనిపించగనే
కువ కువ మంటూ పోతారు !

మార్దంగం :

ఎందుకు వాళ్లను విమర్శించడం ?
విందు చేసుకో కన్నులకు !
ఎంద రెందరో ! ఎన్ని రూపులో !
అందాలకె ఆదర్శాలు !

జడములైన రేఖలకు రంగులకు
చైతన్యంబిడి, మానవులు
తమ అందాలను ప్రదర్శింత్రు - చి
త్రములమై మనము పరికింప !

(ఇద్దరూ మైమరచి నృత్యం చేస్తూవుండగా చేరో వైపునుంచీ అక్కడికి వచ్చిన కళా, చిత్రదత్తులు ఆశ్చర్యచకితులై, చిత్రాలవలె నిలిచి పోతారు. మంజీర చిత్రంలో కళ, మార్దంగం చిత్రంలో చిత్రదత్తు చిత్రాలైపోతారు. మంజీరా, మార్దంగం ఆ చిత్రాలను ఆశ్చర్యంతో చూచి ఆనందంతో నృత్యం చేస్తారు - నేపథ్యంలోని సంగీతానికి అనుగుణంగా.)

నేపథ్యంలో :

మానవుని కానంద
మార్గా లనేకం !
కళ అందులో అమృత కలశం
లలిత
కళ అందులో అమృత కలశం

శిల్పులే చిత్రాలు,
చిత్రాలె శిల్పులూ !
ఒకరిలో ఒకరుండి
ఉన్నతుల కెగయగా
కళ అందులో జీవ కలశం
లలిత
కళ అందులో జీవ కలశం

రమ్య చిత్ర ప్రద
ర్శనము మానవుల కిది !
సరస మానవ ప్రద
ర్శనము చిత్రముల కిది !
ఒండొరుల జూచుకొని
ఉల్లములు పెంచుకొని
ఆనంద పారమ్య
మందుకొని, తరియింప
కళ అందులో ఆత్మ కలశం
లలిత
కళ అందులో ఆత్మ కలశం !

# వసంత స్వయంవరం

(శిశిర ఋతువు చివరి ఘడియ గడిచిపోయింది. వసంతఋతువు తొలి ఘడియ ప్రారంభం కాబోతున్నది. ఒడలెల్ల కనులుగా ఎదురు చూస్తున్నది ప్రకృతి కాంత వసంతుని కోసం. ఆ చూపుల కొసలు ఏదో వార్తను మోసుకు వస్తున్నాయి. అది బృందగానంగా వినిపిస్తున్నది.)

బృందగానం :

అది గదిగో కెందామర పువు బొడిపె !
అది గదిగో మావి చిగురు జెండా !
అదిగో మధుపూర పూర్ణ కుంభం !
అదిగో నవ వసంతోత్సవ రథం !
బైలుదేరె ! బైలుదేరె !
బైలు కొసల నుండి !

మలయానిల పత్రముపై
మధుపాక్షర లేఖ ఇదే !
వసంతుని విలాసాలను
దెసలు చదివి వినిపించె !
వచ్చెనిదే ! వచ్చెనిదే !
వసంతోత్సవ రథం !

కోకిల స్వాగతము చెప్పె తొలుత.
కుంకుమ మిడె మంకెనపువు నెలత.
ఉగాది పల్లకి లోనికి
ఉరికె కొత్త పెండ్లికొడుకు
తరలివచ్చె ! తరలివచ్చె !
తరుణోదయ శోభ !

(వసంతుడు ప్రవేశించాడు. ప్రకృతి పదహారువేల వనలక్ష్ములై అతణ్ణి వరించి వచ్చింది. ఒక్కొక్కరినే అతడు సమాదరిస్తూ వస్తున్నాడు. అంతట మధుప్రియ (కోకిల) అతణ్ణి సమీపించింది.)

మధుప్రియ :

నీ వియోగమహోర్త వార్ణవ పంచకమ్మున
నావ దొరకని దాననోయీ !
పంచమమ్మును దాచుకొని, బ్రతుకోర్చుకొని, నీ
పంచ చేరిన దాననోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !
అణగి, లోకపు కాకులతో దశమాసములు నే
నణువువలె జీవిస్తి నోయీ !
శిశిరపుం గొసలందు నీ చిరునవ్వులే నా
చీకుచింతలు రాల్చెనోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !
కంఠమున శివునిన్ ధరించిన విషమునై, నీ
కరుణకై మనుచుంటినోయీ !
నీవ నన్ను ధరించి, ప్రకృతికి పురుషుడై, న
వ్యావనులు నిర్మింపు మోయీ !
ఓ వసంతా ! నా వసంతా !
జీవన లతాంతా ! నమామి !

వసంతుడు :

నీవటే కోకిలా !

నీవటే కాకిలా ?

నా వియోగము లోన

నల్ల నైనావటే !

నవ్వరే, యెవరైన

నవకవులు వింటే ?

నీవ కాటుక కాయ

వే వనరమల కెల్ల,

నీవ బొగ్గుల కుంప

టే విరహ హృదయాల,

నాకు ప్రియురాలవా ?

నవ్వరే యెవరైన ?

విషపు బాణాగ్రమ్ము,

వింటివా ? నీ గొంతు !

కలిపిగొట్టు నొకప్డు

కలియ గొట్టు నొకప్డు

నీ వటే కోకిలా ?

భావాగ్ని పొగలా ?

(కోకిల సిగ్గుపడి దారి విడుస్తుంది. వసంతుడు పరిక్రమిస్తాడు. రసాలిని (మామిడి) ప్రవేశిస్తుంది.)

రసాలిని :

నేను బాల రసాల లతనోయ్ !
నేను మాధవ ! నీకు జత నోయ్ !
ఉగాదికి రుచుల గాదెను, నే
జగానికి మాధురిమ నోయ్ !

తావి తరగల షట్పదమ్ముల
నీవు వ్రాసిన ప్రేమ లేఖలు
నన్ను నన్నే త్రావి త్రేన్పును
నున్న వివిగో నోయ్ !

తీయ తేనియ పాత్రముల ఆ
తిథ్యమును సమకూర్చి పెట్టితి,
పీపులా ? నీ కేలు సోకిన
చేపవా రసపయోనిధులు ?

వసంతుడు :

ఈ వగరు పింఛెలా
నీ వలపు రసధునులు ?
ఈ తేనెటీగలా
నీ తలపు దూతికలు ?
నవ్వరే, యెవరైన
నవ కవులు వింటే ?
మనసులో కోకిలపు
మసిగూడు కట్టుకొని

శాంతి లోకమును జవ
జవ లాడ కవ్వించు
కెంజివురు బావుటా
రంజించునా నన్ను ?
ఎలమావి నా కొక్క
వలపు నెల వనుకొంటి,
నింగికే గురి పెట్టు
నిప్పు బాణపు మొనవె !
చూతులే తరువాత,
చూతమా ! నిలువుమా !

(రసాలిని దారి తొలగుతుంది. నింబలత (వేప) ప్రవేశిస్తుంది.)

నింబలత :

ముద్దులొల్కు భూ కాంతకు ముత్యాల్
ముగ్గులు పెట్టిన వాకిలి నేను,
నింగి అద్దమున నా ప్రతిబింబమె
తొంగి చూడదా పాలపుంతవలె ?
రావోయీ, మధుదేవా ! కై
కోవోయీ, నా సేవ !
పికములు, శుకములు, కాకము లనుచున్
భేదము లేదోయ్ నా పంక్తి !
అందరి కాయు, స్సారోగ్యము, భా
గ్యము సమముగ కూర్చే రాణిని నే !
రావోయీ, మధుదేవా ! కై
కోవోయీ, నా సేవ !

వసంతుడు :

నీ పూల నవ్వు వె
న్నెల కాయునే కాని,
వెన్నెలల కడలిలో
విషము దాగిన దమ్మి !
చేదు విషమో లమ్మి !
చేరరాకో లమ్మి !
వేల చూపుల వలపు
పూలప్రభ వనుకొంటి !
నీ గుండె చేదుతో
నింపు కొన్నావటే
ఆయురారోగ్యలె
ఆనంద మగునటే ?

(నింబలత నిష్క్రమిస్తుంది. ఇక్షు కాంత (చెరకు) ప్రవేశిస్తుంది.)

ఇక్షుకాంత :

చెరకు వింటి చెలి చెప్పగ
వింటిని, నిను కంటిని
మల్లిక నీ మాట చెప్ప
ఊరితి, నిను కోరితి !

పువ్వుటమ్ము రివ్వుమనగ
నేను కూడ దానితోడ
దూకి నిన్ను తాకలేక
విలపించితి విరహ బాధ !

విశ్వానికె రుచి, పంచమ
వేదానికె పర్వము నే !
కనికరించి చేకొనుమా,
కాంతా ! ఓయి వసంతా !

వసంతుడు :

ఓసి, గడసాని ! నీ
బోసి నవ్వుల కేమి,
వాసి వన్నెల కేమి,
వాలు చూపుల కేమి.
నాప్రక్క నిను చూచి
నవ్వరే ఎవరైన ?
దీను రాలవు, పరా
ధీను రాలవు నీవు
ఆసనమవే గాని
అమ్ము వెట్లగుదువే ?
ఎత్తరా మగనాలు
ఏల గలదే మగని ?
నీ నింద ఎంతెంతొ
తేనెయున్నను గాని
నమిలి మింగిన కొలది
నార సాగును పిప్పి
వేణు ప్రియవె కాని
వినపడదు నీ పకుకు

(ఇక్షుకాంత ప్రక్కకు తొలుగుతుంది. ఒక వెండి గిన్నెను చేత పట్టు కొని నాట్యం చేసుకొంటూ ఒక గోపిక ప్రవేశిస్తుంది. తన ప్రాణాలు ఆమె చేత నున్నట్టుగా వసంతుడు ఆమె ననుసరిస్తాడు.)

గోపిక :

ఉగాది దేవత,
యుగాది దేవత,
జగానికే అ
గ్రగామి దేవత,
దిగాలు పడనేమి ? వసంతుని
మొగాన ఎరుపేమి ?
ప్రణయ విహంగము
పరభృత మనుచు,
ప్రియ మాకందము
పేదది యనుచు,
సిద్ధ నింబలత
చేదే యనుచు,
కోమలేక్షువే
కురూపి యనుచు,
దిగాలు పడనేమి ? వసంతుని
మొగాన ఎరుపేమి ?
ఆకులు రాలని
మ్రాకు లున్నచో,
శిశిరము సోక
చేత మున్నచో

చేదే యెరుగని
స్వాదు వున్నచో,
కుందు లేని ఆ
నంద మున్నచో
        జగాన దిగులేమి ? వసంతుని
        జన్మకు కతమేమి ?
రసాధి దేవత
వసంత భూమిక
ఒసంగినవె ఈ
పసందు లన్నీ,
        అసాధువన నేమి? వసంతుని
        ప్రసాదమే భూమి !

(ఆమెతో కలిసి నాట్యం చేస్తూ వసంతుడు ఆమె చేతిలోని పాత్రను తన చేతిలోకి తీసుకొంటాడు. రుచి చూస్తాడు. తేజోవంతుడవుతాడు. ఆనందమూర్తి అవుతాడు.)

వసంతుడు :

అనిర్వచనీయ మిది, ఓహో !
అమృతమునకే అమృతమో !
అపూర్వము, అద్వితీయ, మహో !
ఆత్మకే ఇది ఆత్మమో !
        ఓ జగన్మధు మోహినీ ! నా
        యాగమము నీ కోసమేనే !
        కంఠమున కల కంఠములతో
        కందొవల యెల వెన్నెలలతో

అధరమున శీధురసములతో
అఖిల సౌందర్యరుచి నీవే !
ఓ జగన్మధు మోహినీ ! నా
యాగమము నీ కోసమేనే !

(ఆమె అతని కేలు గ్రహిస్తుంది. పాత్రను తిరిగి మెల్లిగా అందు కొంటుంది.)

గోపిక :

ఇదేనోయీ, అమృత కలశం !
ఇదేనోయ్, జీవన రహస్యం !
తీపి, చేదూ, వగరు, పులుపూ
రూప మందిన విశేషం !

విడివిడిగా ఒక్కొక్కరుచి కే
ర్పడదు సంపూర్ణత్వము.
అన్ని రుచుల సమైక్యమియ్యది.
ఆంధ్ర కిది ప్రత్యేకము !

బ్రతుకు భాండము నింద నవరస
పాకములు నింపిన దిదే నోయ్ !
కష్టసుఖముల నిగ్గు, తెలుగు ఉ
గాది పచ్చడి ఇదే నోయ్ !

(ఆమె ముందు, అతడు వెనుక నాట్యం చేసుకొంటూ నిష్క్రమిస్తారు. ప్రకృతి అంతా సుందర తరంగా వికసిస్తుంది.)

వసంతుడు :

బలే దానవే ! బలే జాణవే !
తెలుంగు వాసిని నిల్పితివే !
ప్రపంచరుచులకె అధినాథుడ నను
పచ్చడి గిన్నెను పట్టితివే !
మహీమాధురీ, మధురఝురీ ! మ
న్మనోహరీ ! ఆంధ్రీ !
ఉగాది పచ్చడి నిగారములలో
జగజ్జీవితమె గుబాళించెనే !
ఏ రుచి కందని వసంతునే నీ
పారాణకి పహరా పెట్టితివే !
జనుస్సుందరీ ! జగా జహ్వారీ !
జనతా మాధురి ! ఆంధ్రీ !

# గులాబి ప్రసవించింది

(రంగం ఉద్యానవనం, గులాబితీగ ప్రసవ వేదన పడుతున్నది. దాని చుట్టూ చేరింది – తుమ్మెద, సీతాకోకచిలుక, కోకిల, మందమారుతం, ఆకుపురుగు, గుడ్లగూబ, మేకపిల్ల, గోపిక వగైరా ఇరుగు పొరుగంతా. ప్రక్కనే తామర కొలను, కోటాకు వేసిన అరటి, తులసికోట, తోటకూర చెట్టు, క్రోటను మొక్క, కరివేపచెట్టు, ఇత్యాదికూడ. మొత్తం ఉద్యానవనం అంతా గంభీర ముద్రదాల్చి వుంది. మధ్య మధ్య ఇరుగుపొరుగుల సన్నని గుసగుసల సవ్వడులు, నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. గులాబితీగ ప్రసవ వేదన పడుతున్నది.)

సీతాకోక చిలుక :

జువ్వలా ఎదిగింది
జువ్విలా అలిమింది
బ్రతుకంత వేవుళ్ళై
బక్కపలచని తల్లి,
మసలకోయీ, మందమారుతం ! కాసేపు
విసరవే, కమలా కరం !
తుమ్మెదయ్యకు కలలు
బొమ్మకడుతున్నాయి.
విశ్వాల యవధులకు
వెడలి వస్తున్నాయి !
అతిలోక రుచులు నించుకొన ! నందన వ
నానంద సుధలు పంచుకొన !
పాడకే కోకిలా !
ఆడకే నెమలీ !

క్షణమైన ఊరకుం
డని వేడ్కలేమిటే ?
చూపులకు రాణియౌ చిన్నది, పురిటింట
చావుబ్రతుకుల మధ్యనున్నది !
ఆకు పురుగా ! నీకు
ఆకలే లోక మటె ?
మేకపిల్లా ! కొండ
మిట్టలకు పోలేవె ?
కష్టసుఖములు పంచుకోని - మనుగడలు
సృష్టికే బహుముఖ గ్లాని.

గుడ్లగూబ :

కోకడాబుల వట్టి
పోకిరీ యనుకొంటి,
గట్టిదే యీ పిల్ల !
గుట్టు తెలిసిన పిల్ల !
ద్విజులమే మేమంత,
త్రిజము గద అది కొంత !
కాని, ఏమిది ? ఇంత
గడబిడా యెందుకో ?
కనుట పెంచుట సహజ
కార్యాలె కావొకో ?
పిచ్చిలోకము, గులా
బీ చుట్టు చేరినది !

తులసి :

నిండుచూలా లీగులాబీ తీగచెల్లి
పండువౌ కన్నులకు వెన్నెల పాలవెల్లి !
అంద మంతర్వత్నిదే గద సృష్టిలోన !
అబ్జమిత్రుని గనదె ప్రత్యూషము సుఖాన !
అబ్బ ! ఎంతటి వేదనో ! అటు సుళ్ళు తిరుగు !
బొబ్బలిడుటకు కూడ ఓపిక లేక సురుగు !
ఇరుగుపొరుగంతయును కన్నుల నించు నీరు !
ఎవ్వరే మొనరించగల, ఠిది సృష్టి తీరు !

కోకిల :

ముగ్ధ సుందరలత భరించెడి
మూగి వేదనకు శ్రుతి కలిపి,
ఆత్మ వేదన ననుభవించెడి
అఖిల వనమును గొంతు నిలిపి.
నాద రూపము నొసగి ప్రకటన చేతు నేను.
నన్ను ఎవరేమన్న, నేనిది మానలేను !
పరుల దుఃఖము లెక్కచేయని
పాడుకుల మనుకొంద్రు గాని,
పాడుతనమున కోటిదుఃఖాల్
గూడుకట్టుక యుండు టెరుగరు
గుండెనిండే పొంగిపొర్లే మందులన్నీ
గొంతు వెల్వడుచుండు పాటలరీతి, చిన్నీ !
ప్రసవవేదన లతిక దైనా,
పశువుదైనా, పదతిదైనా,

విశ్వవేదన యది; సమస్తా
వేగములకును కేంద్ర మయ్యది;
దానికేదో దారి బైటికి లేక యున్న,
ధరణియే బ్రద్దలగు, నూతనసృష్టి సున్న.

నెమలి :

మధురవేదనా భరమున
మానలేదు పికము పాట.
అతి దుఃఖావేగములో
ఆపలేను నేను ఆట;
నర్తనమని అనుకొందురు పామరులు,
కర్తవ్యము లేక వణుకు పాదములు !
నిరంతరము చూలాలు,
నిత్యము బాలెంతరాలు,
ప్రకృతిదేవి మందిర మొక
పరమానంద కందము;
కడలిమీది కెరటాలీ కానుపులు
కదలించుకపోవు నన్ను లయగతులు

ఆకుపురుగు :

రోజూ చచ్చేవాడికి
ఏడ్చేవా డెవడు ?
రోజూ పుట్టేవాడికి
సంతోషం ఎందుకు?
నిత్య తద్దినానికి ఫలశ్రుతి
ధర్మపిండం.

మానుకోవాలట తిండి !
మహాచెప్తారు లెండి !
చెట్టుమీద పిట్ట,
చెట్టుకింద రెట్ట !
ఎందుకయ్యా వేదాంతం మెట్ట ?
నాక్కావలసిం దింత రొట్ట !

మేకపిల్ల :

ఔను, గురో ! ఔను
"రొట్ట" ఎంతటి అమృత శబ్దం !
అవతరించావయ్యా, శబ్దబ్రమ్మా !
అందించవయ్యా, మరోకొమ్మ !

ఏడ్వాలేదు, నవ్వాలేదు;
ఉన్నదంతా, వేదాంతం, దంతం;
నీ లయకు నా తాళం, మేళం;
కోరికెయ్ ఒక నాళం !

సీతాకోక చిలుక :

అడ్డం వస్తున్న వెవో
అపశ్రుతుల వంటివి !
సుఖప్రసవ సహాయ్యక
సుప్రసార వీచికలకు
అడ్డం వస్తున్న వెవో
అపశ్రుతుల వంటివి :

చూడకమ్మ, ఇటు కేసి,
చూలాలవు, అరటి !
బెదరగలదు మానసము,
చెదరగలదు విశ్వాసము.
　　చూడకమ్మ ఇటు కేసి,
　　చూలాలవు, అరటి !

తులసి :

మృదుల దళ చేలాంచ లమ్మున
వదనమును గప్పుకొని, కన్నులు
తుడుచుకొను చుండినది, పాపం
జడుచుకొనుచుండినది, అనటి !

చుట్టు నల్గురు పిల్లలతో ఈ
చుట్టుప్రక్కలకెల్ల గృహిణివి,
సుఫల హస్తములతో ఇహపర
సుగతి కీవె తెరువువి !

కలగవలదోయమ్మ, రంభా !
కన్నులెఱ్ఱని దొప్పలైనవి !
మృత్యువన్నది భ్రాంతి, బ్రతుకే
సత్య; మది నీ ప్రక్కలేదే ?

గుడ్లగూబ :

అరటిబోదె కన్నీటిని
అపశ్రుతిగ తలచు చుండ్రి !

స్వార్థపరుల భావపరం
పరల నేల గుర్తించరా ?

కన్నీరెటు వంటిదైన
కరగించును కష్టాలను,
స్వార్థమాత్మగతమె యైన
ప్రగతికి ప్రతిబంధకమౌ !

మనకెందుకు లెమ్మని ప్రతి
మంచియు చెడ్డను సహించు !
చివరకు మంచిని అడంచి
చెడ్డయె జగమాక్రమించు !

తోటకూరచెట్టు :

చూడలేకున్నాను సుకుమారి కష్టం !
తొందరగ ప్రసవించ దెందుకోగాని !
రాత్రిగడవకముందే రావాలి పురుడు '
ముద్దుముచ్చట చూచి పోవాలి నేను !

క్రోటను మొక్క :

ఒసే తోటకూర చెట్ట !
ఎందుకె నీకంత వెట్ట ?
ముండ్లతీగ యెక్కడైన
ముచ్చటగా ప్రసవిస్తదె ?

సీమరాణికంటే, ఈ
సీతకోకచిలకకంటె
రంగుల రాణిని నేను,
రండా ! ఇటు చూడ వేమె ?

తులసి :

వెలుగున్న చోట నీ
దలులేక యెట్లుండు ?
నీడలను భేదించు
నేత్రమ్ము కలుగవలె;
అప్రమత్తత నుంటివి కదే ?
కరివేప !
అంతర్గృహము భద్రముకదే ?
అభ్యుదయగతి నేవా
అద్భుతలపులు తాకె,
వారింప వలయు మన
వాసనా బలముతో
నలుదెసలు కట్టుకొంటివి కద ?
క్షణములో
వలరాణి పుట్టుచున్నది పొద !

సీతాకోకచిలుక :

తెల్లవార్లు నొప్పులు పడి,
జిల్లార్చుకపోయి గుండె,
కొనవూపిరితో మూల్గుచు
ననబోణియ మూర్ఛపోయె !

సమయము వచ్చినదమ్మా !
సకియలు మేల్కొనరమ్మా !
మల్లె ! మాలతీ ! జాజీ !
మందారమ ! రేరాణి !
కల్హారమ ! కమల కళిక !
కాంచనమా ! కల్పలతిక !
మీమీ నవరుచుల తోడ
మేల్కొనియుంటిరి కదమ్మ ?
ఏమోయీ, మరందపా !
ఎంతసేపు నీ తపస్సు ?
వేదనా తరంగ మదిగొ
వినువీధుల నొరసికొనె !
అది విరిగిన ముహూర్తమే
ఆనందోదయము సతికి !

మందమారుతం :

పద్మాశ్రయ కుటీరమున
భ్రమరము చాలించె తపము !
అతని ఊహల చివళ్ళకు
అమృతధార ప్రవహించెను

గొంతుకలో కారుణ్యపు
గోదావరి పొంగిపొర్లె,
విశ్వక్షేత్రములె మునుగ
విలపిస్తున్నది కోకిల !

బృందగానం :

విపథమ్ముల విపర్యయపు
విపక్ష ప్రభావమ్ములు

నిరస్తమ్ములై క్షణములో
నిరామయమ్మయ్యె ప్రకృతి !

అందాలతో, అమృతాలతో
అరుదెంచెను సరస్వతియె !
చీకటి తెరచిట్లె, వెలుగు
కాకలు మిరుమిట్లు గొల్పె !

ఉదయారుణ రాగాంబుధి
నోలలాడి పూర్వదిశా
భామిని రవి గన్నట్టులు
ప్రసవించెను మా గులాబి !

గుబ గుబలాడుచు దిక్కుల
గుబుల్కొనెను రాగరశ్మి !
ఘుమఘుమ లాడినది కోటి
కోకనదముల మనోజ్ఞత !

గుడ్లగూబ :

ఇంతేనా ? ఇంతేనా ?
ఇందుకేన ఇంత రభస?
కొండో, గోపురమో అను
కొంటి వట్టి పువ్వేనా ?
నిష్ఫలమిది, దీనిలోన
నిశ్రేయస మే మున్నది.
పిచ్చివాండ్ల రాణి యిది;
నచ్చదు నా వంటి ఋషికి !

గోపిక :

ఏ మంద, మే మంద
మెంత చక్కని పువ్వు ?
ఎంత మక్కువ పువ్వు !
ఎంత ముద్దుల పువ్వు !
చెంత రమ్మను చున్నదే !
నా తోట
చిట్టి చెల్లిని గన్నదే !
పొదుపులో ప్రొద్దువలె
పొదలోన నా పువ్వు
ననుచూచి నవ్వుచు
న్నది బోసి చిరునవ్వు !
తలదువ్వి జడవెయ్య వమ్మా !
అమ్మ !
తలదాల్ప పోనియ్య వమ్మా !
దెసల అందము లన్ని
పసుపు కుంకుమ లన్ని
నెత్తావి సిరులన్ని
కొత్త కోరికలన్ని
ముద్దగా పుట్టు కొచ్చినది !
నా రోజ
ముద్దులు కురుస్తున్నది !
వాగుపై ఏ రభసొ
రేగినట్లున్నాది !
కొమ్మలన్నీ చాల
చెమ్మగిలి వున్నాయి !

చచ్చిపడిపోయాయి చీడలు,
ముళ్ళవలె
గుచ్చుకోవిక పీడలు !
కోకిలము కంఠాన
కొత్తరాగము తొణికె !
మందారమున కొత్త
యందాలు మొలకెత్తె !
పరవశతలో నున్నది !
వనమెల్ల
పురిటి గదిగా నున్నది !
నిజము సౌందర్యమ్ము
ప్రజన సౌందర్యమే;
నవ సృజనలోని ఆ
నందమే పరమమ్ము !
పాల్కడలి రుచుల తోతెంచు
ప్రకృతి
బాలెంతలో క్రుమ్మరించు !
అనురాగ రుచులతో
ఆనంద రసముతో
ఆత్మ సంపత్తితో
ఆశావధులు విదియ
తృష్ణతో నను చేరును !
ఈ పువ్వు
కృష్ణమౌళిని కోరును !

(గోపిక ఆనందంతో గంతులు వేసుకొంటూ గులాబి పొదను దరిసి, పువ్వును ముద్దు పెట్టుకొంటుంది.)

# దేవయాని

(శుక్రాచారులవారి ఆశ్రమం. మనోజ్ఞమైన ఉద్యానవనం అది. శుక్రాచార్యులు తపస్సులో వున్నాడు.)

## నేపథ్యం నుంచి :

రాక్షస రాజైన వృషపర్వుని కులగురువు శుక్రాచార్యులు. శుక్రాచార్యుల వద్ద మృతసంజీవని విద్య కలదు. దేవతలకు, రాక్షసులకు తరచు జరిగే యుద్ధాలలో మృతులైన రాక్షసులను మృతసంజీవనితో బ్రతికిస్తూ వుండేవాడు శుక్రాచార్యులు. దేవతలు చస్తే ఒకటే చావడంగా ఉండేది. అందువల్ల దేవతలకు కూడా మృతసంజీవని అవసర మయింది. శుక్రాచార్యుల వద్ద మృత సంజీవని నేర్చుకొని రమ్మని బృహస్పతి కుమారుడైన కచుణ్ణి పంపించారు దేవతలు. శుక్రాచార్యుల కుమార్తె దేవయాని. దేవయానిపై శుక్రాచార్యులకు అతిప్రేమ. మృతసంజీవనిని గ్రహించాలంటే తండ్రి, కుమార్తె లిద్దరినీ కూడ తన వినయ విధేయతల ద్వారా మెప్పించవలసి వుంటుందని ముందే హెచ్చరించారు కచుణ్ణి దేవతలు. కచుదు బాలుడు, నియమ వ్రతశీలుడు. రాక్షస రాజ్యంలో శుక్రాచార్యుల ఆశ్రమంలోకి దిగి వస్తున్నాడు. దేవయాని బాలిక, ప్రేమశీల, కచుణ్ణి చూచింది.

(అటు చూస్తూ దేవయాని ప్రవేశిస్తుంది)

దేవయాని :

బారెడు పైకేగినట్టి
భాస్కరుడదె ఇద్ద రయ్యె !
జాము ప్రొద్దు పగటి తీగ
జంట పూలు పూచె నేడు !

అందులోన ఒక్కమూర్తి
అద్వితీయ తేజస్వి !

ఇటే కదలి వచ్చుచుండె
ఏమో, ఈ వింత నేడు !

(దూరంలో కచుడు కనిపించాడు. అతడు దేవయానిని చూశాడు)

కచుడు :

ఎవరా జాబిల్లి రేఖ
నవ కల్పద్రుమ శాఖ
మా జయంతు దరహాసము
మన్నించిన మయూఖ !

దేవలోక కాంతి యెల్ల
త్రోవచూప వచ్చినదో !
సంజీవని విద్యే ఇట్లు
స్వాగతమీ నిల్చినదో !

(అతడు ఆమెకు బాగా చేరువైవాడు. ముఖాముఖి నిల్చున్నారు. అతడు నత శిరస్కుడై అభివాదం చేశాడు. ఆమె తృప్తిగా నిట్టూర్చింది. అంతలో ధ్యాననిమగ్నుడైవున్న శుక్రాచార్యులు కనులు తెరచి చూశాడు. కచుడు సాష్టాంగపడి)

కచుడు :

యతి సత్తమ ! నేను బృహ
స్పతి సుతుడను, పేరు కచుడు, పటు నియమ సమ
న్వితుడను; సేవింపగ వ
చ్చితి మిము, నను గైకొనుండు శిష్యునిగన్.

(శుక్రాచార్యులు కచుణ్ణి ఆదరంతో చూచి)

శుక్రాచార్యులు :

కచుడవా ? నిన్ను చూడ నాకగురు జూచి
నట్లె యయ్యెను, సంతోషమయ్యె, బిడ్డ !
సుఖులె గద సురల్ ? నీ కేది సుఖమొ దాని
నాచరింపుము, నీదె ఈ యాశ్రమమ్ము.

ఇది దేవయాని, నా సుత;
కొదువ యొదవకుండ జూచుకొను నిది నిన్నున్,
ముదమున నుండుము మాతో,
చదువు కొనుము, నేర్చినంత చదు వెరిగింతున్.

(రంగం చీకటయింది)

నేపథ్యం నుంచి :

ఆ విధంగా కచుడు శుక్రాచార్యుల శిష్యుడైనాడు. భక్తిశ్రద్ధలతో, వినయ విధేయలతో ఆచార్యుని, ఆచార్య పుత్రి దేవయానిని సేవిస్తూ వారి అభిమానానికి పాత్రుడైనాడు. ముఖ్యంగా దేవయాని స్నేహానికి పాత్రుడై, ఆమె హృదయాన్ని చూరగొన్నాడు. అతని నిత్య కృత్యాలలో ప్రధానమైంది పశుపాలన. ఒకనాడు హోమధేనువుల్ని మేతకై అడవికి తోలుకు పోయినాడు. సాయంతనమయింది. దేవయాని అతని రాకకై ఎదురు చూస్తున్నది.

(రంగంలో వెలుగు ప్రసరించేటప్పటికి దేవయాని నిల్చుని వుంది.)

దేవయాని :

ఏ క్షణమ్మున కచుని వీక్షించి నానొ
తక్షణమ్మె నా హృదయ మాతనికి చెందె !
బాల సూర్యుడు మరుగైన పద్మిని యటు
నిలువలే నాతనిని వీడి నిమిషమైన !

రవియు అస్త్రాద్రి చేరె; ధేనువులు మరలి
వచ్చుచున్నవి; కానుపింపడు ప్రియుండు !
సమిధలకు వెన్క నాగెనో ! సరసయుక్తి
తను పరీక్షింప దాగెనో వన లతాళి !

(రంగం మళ్ళీ చీకటయింది)

నేపథ్యం నుంచి :

ప్రొద్దు గ్రుంకిపోయింది. హోమ ధేనువులన్నీ తిరిగి వచ్చేసినై. కచుడు రాలేదు. హృదయం కీడు శంకిస్తున్నది. ఇక ఆగలేక తండ్రికి చెప్పింది దేవయాని. శుక్రాచార్యులు దివ్య దృష్టితో చూశాడు.

(రంగంలో వెలుగు పడేటప్పటికి శుక్రాచార్యులు, దేవయాని కనిపిస్తారు.)

శుక్రాచార్యులు:

మన రహస్య విద్యల గొని చను నటంచు
కచుని జంపిరి దైత్యులు కదు నసూయ;
జీవితుని జేసి తెత్తు సంజీవి బంపి;
ఊరడిలుము క్షణము, కను లొత్తుకొనుము.

(రంగం చీకటయింది)

నేపథ్యంనుంచి :

శుక్రాచార్యులు మంత్రం విసిరాడు. సంజీవని ప్రభావంతో కచుడు బ్రతికి వచ్చాడు. దేవయాని ఆనందించింది.

మరొక రోజున మళ్లీ కచుడు మాయమై పోయాడు. శుక్రాచార్యుల దివ్యదృష్టి కూడ పనిచెయ్యలేదు. దేవయాని ఎంతో ఏడ్చింది.

రంగంలో వెలుగు. దైన్యంతో దేవయాని. ఆందోళనగా శుక్రా చార్యులు.

శుక్రాచార్యులు :

పగబట్టి దైత్యు, లాతని
తెగ జంపుచునుండ్రి, అతడు దేవత గానన్
సుగతికె చను, నాతనికై
వగవగ నేమిటికి, తల్లి ! వదలు మపేక్షల్.

దేవయాని :

సురగురుని ప్రియ సూతి, శిష్యుండు మీకు,
సుగుణముల ప్రోవు, తేజస్వి, సువ్రతుండు,
దిక్కులేనట్టు దనుజుల జిక్కి చావ
హృదయము గలట్టిదాన నెట్లేద్వకుందు ?

నేల, నీరు, గాలి, వెలుంగు, బైలు లేక
మనిన మనవచ్చుగాని, ఆత్మగతమైన
ప్రేమమే లేక జీవింతు రెవరు? దయను
కచుని బ్రతికించి తెచ్చి నన్ గావు, తండ్రీ !

(ఇద్దరూ నిష్క్రమిస్తారు ఆందోళనతో)

నేపథ్యంనుంచి :

దేవయాని దైన్యంచూచి, శుక్రాచార్యులు హృదయం ద్రవించి దివ్యదృష్టితో బైట విశ్వమంతా గాలించాడు. చివరకు లోచూపు చూచు కొన్నాడు. అక్కడ. తన గర్భంలోనే భస్మ రూపంలో వున్నాడు కచుడు. రాక్షసలు కచుణ్ణి చంపి, భస్మం చేసి, మద్యంలో కలిపి, శుక్రాచార్యుల కివ్వగా, ఆయన తెలియక దానిని త్రాగి వేశాడు ! సురాపానం వల్ల జరిగిన అపకారం అది. సురాపానం మహాపాపం అగుగాక అని అప్పుడే శపించేశాడు ఆయన. తరువాత మృత సంజీవనిచే తన కడుపులోని కచుణ్ణి బ్రతికించాడు. కచుడికి మృతసంజీవని ఉపదేశించాడు. కచుడు శుక్రాచార్యుల ఉదరాన్ని చీల్చుకొని బయటికి వచ్చి తిరిగి ఆయనను బ్రతికించాడు. దేవయాని ఆనందానికి మేర లేకపోయింది. కొంత కాలం తర్వాత ఒకనాడు :

(సాలోచనగా కచుడు ప్రవేశిస్తాడు)

కచుడు :

సూర్యుడుదయించె, అపరాబ్ధి జొచ్చె శశియు;
పద్మ మానందపడె, కదు వగచె కలువ !
మానవులొ, దేవతలొ -- ఏరికైన గాని
జీవితము సుఖదుఃఖ సజ్జీకృతమ్ము !

దేవకార్యము తీర్చి సంజీవి నేర్చి,
గురువు సెలవొంది, స్వర్లోక మరుగు నాకు
ఉల్ల ముప్పొంగి అలలు వేయుటకు బదులు
బెంగ వంటిది దిగులేదొ క్రుంగదీయు !

గురువుపట్ట భక్తి, గోవులయెడ రక్తి,
ఆశ్రమంపు స్నేహ మవలద్రోచి
అరుగు నేను-- దేవయాని చూపుల తడి
తడిసి ముద్దయైన మిడుతనైతి !

ఆమె తనుదాన నా కొరకై యజించు
కొనుచున్నది ప్రేమాగ్ని కుంద మందు,
దేవ కార్యార్థమై వచ్చి పోవుచున్న
స్వార్థ పరుడను నేను, స్వేచ్ఛా రహితుడ

(దేవయాని ప్రేమపట్ల సానుభూతితో, నిస్పృహాయతతో కుమిలి ప్రయాణానికి సిద్ధంగా వున్న కచుని వద్దకు దైన్యం మూర్తి దాల్చినట్లు, గ్రహణం పట్టిన చంద్ర శకలంవలె కన్నులు తుడుచుకొంటూ దేవయాని వచ్చింది. ఆమె నిమీలిత నేత్రాంచలాలను అనిమేషుడై చూచాడు కచుడు. ఆమె చూపులు తన పాదాలపైబడి, ద్రవించి, భూమికి అతికించి వేస్తున్నాయి. అతడు మాట్లాడడు, మాట్లాడలేదు. ఆమె గాద్గద్యంతో తడిసిన మెరుపువంటి స్వరంతో ప్రశ్నించింది.)

దేవయాని :

నిన్ను చూచిన యది మొదల్ నిన్ను పొంది
నన్ను విడిచినయది సుమీ నా హృదయము !
ఇపుడు నను వీడి నీవు పోయెదవయేని
వట్టి కట్టెగ నేనెట్లు బ్రతుకగలను ?

నిర్జరాగ్రణివగు నిన్ను నే వలచుట
స్వార్థమే యనుకొమ్ము; ఏమైనగాని,
ఆడు పుట్టుక పుట్టినయట్టి నాకు
వలచి పెండ్లాడకుండు టెట్టులు పొసంగు ?

ఈవు బ్రహ్మచారి, నేనును కన్యను,
మన వివాహ మొసగు మహికి శుభము;
దేవ దైత్య గురులు దీవింత్రు, కలకాల
ముభయ కులము లైక్యమున వసింత్రు.

ఆత్మలకు వివాహమైపోయె నేనాడో,
దంపతులమె మనము ధర్మదృష్టి;
తనువులొకటి యగుటె తరువాయి, కావున
కొనుము నన్ను, విద్యగొన్నయట్లె !

కచుడు :

ప్రాణమున కంటె ఎక్కువ
గా నిను ప్రేమింతు, నీవకావే నా యీ
ప్రాణమును, విద్యయును, వి
జ్ఞానమ్మును ? సర్వమీవె నాకు, శుభాంగీ !

నిను వలచుట, పెండ్లాడుట
ఘన మేమియు కాదు, నీవు కల్యాణివి, నా
యునికికె కారణ దేవత,
వనిశము నిను జీవితాంత మారాధింతున్.

గురుపుత్రి వీవు, నేనును
గురుపుత్రుడ; సోదరుల మగుదు మే వరుసన్
పరికించిన, అదియును గా,
కిరువురు నిందబడు కార్యమేలా మనకున్ ?

నిన్నుమానిం త్రసురులు,
నన్నుమానింత్రు సురలు, నైజమ్ముగ; ఈ
జన్మముల ఫలితమేమిటి ?
మన్నిక లేకున్న మీద మని యేమిటికిన్ ?

ఊహింపు మిదంతయు, ఉ
ద్వాహపు భావమ్ము మాను, అనవరతము నీ
స్నేహమ్మె నాకు జీవిక;
వాహన మదె వచ్చె, పోయి వత్తునె ? సెలవే ?

(దేవయాని మౌనంగా వుండిపోతుంది. కచుడు భారంగా నిష్క్రమిస్తాడు.)

దేవయాని :

ప్రణయ హృదయమ్ము నీకు అర్థమ్ము కాదు,
ప్రాపు తొలగి నంతనె అది పగిలిపోవు;
నీవు పోయిన, పోవు నా జీవితమ్ము;
సూక్తులెన్నైన నను మనుచుకొనలేవు.

బ్రతుకగా లేను యెడబాటులోన;
ప్రేమకై మరణించు నదృష్ట మేని
లేదు నాకు, సంజీవని లీల జేసి;
పరుల కమృతమ్ము నాకు చావయ్యె నౌర !

ఇంక దేవయాని ఎండిన సెలయేరు,
పగిలి పొగులునట్టి ప్రణయ పాత్ర,
అరుణ కాంతులందు ఆరాటపడు పెంకు,
చావు బ్రతుకు గాని శాశ్వత గతి !

ఇవ్వగలను కనుక ఇచ్చితి హృదయమ్ము,
భద్రపరచుకొమ్ము స్వర్గమందు ;
చావలేను కనుక జీవింతు విధిచేతి
చిత్రలోక మందు చివరిదాక !

ఇర్వురై ఆనాడు ఇనుదుర్వి కుదయించి
ఒక్కడై ఈనాడు ఉపరితల మంటె !
అరుణోదయమునాడు ఆత్మనే వెలిగించి,
ఆర్పిపోయెను నేడు ఆశలను కూడ !

ఈ యగాధములోన
ఏ చేతి కీ తనువు ?
హృదయమ్మె భగ్నమై
ఎందుకీ బ్రతుకు ?

(మూర్ఛ పోతుంది. రంగం చీకటైపోతుంది)

# మెదడులో మెరుపు

(రంగం ఒక ఊడ్పు పొలం. దంప నేలలు, ఆకు మడులు, కూలీలు వగైరా సూచించే రంగాలంకరణ. ఇద్దరు కూలి బాలికలు పూజాద్రవ్యాలతో ప్రవేశిస్తారు)

బాలికలు :

మూన ముహూర్తము చేయగ రారే ?
ముల్లోకాలకు తిలకముంచరే !
పుష్పగంధములు, పసుపు కుంకుమలు
పూర్ణ కుంభములు తేరే !
పైరుగాలి నాలుకకు రాయరే
పరమాన్నమును రవంత.
వానబాలు పెదవుల కందీయరె
పాల చెంబు నొక యింత !
సస్యదేవతా శుభ కల్యాణో
త్సవ వేదిక, దంపచేను గనరే !
బక్కజీవి వరి మొక్క కడుపులో
ముక్కోటాంధ్రుల మ్రొక్కు లుంచరే !
మూన ముహూర్తము చేయగ రారే !
ముల్లోకాలకు స్వాగతమీరే !
అందము, ఆనందము, బ్రహ్మమునకు
అన్నోత్పత్తికి పూజ సల్పరే !

(కూలి బాలికలు పూజచేసి నిష్క్రమిస్తారు.)

నేపథ్యంలో నుంచి :

మూనముహూర్తం చేశారు. ఊడ్పులు ప్రారంభించారు. అయితే దమ్ము అవడం

లేదు. చేనికి నీరందడంలేదు. పల్లాలు మునిగి పోతూవుంటే, మెరకలు ఎండిపోతూవున్నాయి. మునుం సాగడం లేదు. కూలీలు సాగదీసు కొంటున్నారు.

(అంత ఊడ్పు అభినయిస్తూ కూలీల ప్రవేశం)

కూలీలు :

అదును పదు నన్నారె, తుమ్మెదా !
కదిలించు కొచ్చారె, తుమ్మెదా !
దమ్మైన కాలేదు, తుమ్మెదా ! ఆకు
దవ్వలా గున్నాదె, తుమ్మెదా !

పల్లాలు మునిగేయి, తుమ్మెదా ! మెరక
పల్లాలు సరిలేదు, తుమ్మెదా !
ఏరు దిగితేగదా ? తుమ్మెదా !
గోరు దిగుతుందమ్మ, తుమ్మెదా !

గట్టు పైనీ రైత ! తుమ్మెదా !
గట్టుదిగి రావయ్య ! తుమ్మెదా !
పారందు కోవయ్య ! తుమ్మెదా ! మిట్ట
పల్లాలు సముజెయ్యి ! తుమ్మెదా !

నేపథ్యంనుంచి :

ఊడ్పు కూలీలు ఇలా గోలపెడుతూ వుంటే, రైతులూ, కాపులూ కలగ దొక్కు కొంటున్నారు.

(అంత రైతు ఆందోళనగా ప్రవేశిస్తాడు)

రైతు :

తోలండి గిత్తల్ని తోలండిరా !
తోవ రేగేటట్టు తరమండిరా !
అదలించి తోలండి
బెదరించి తరమండి
బిగబట్టి నొక్కండి
బెల్లు లేపండిరా ! ॥తో॥
తొక్కండిరా, తొరుము తొక్కండిరా !
తొడలోతుగా పార కొట్టండిరా !
పై మిట్ట తీయండి
పల్లాలు పూడ్చండి
గోరైన దిగకున్న
వేరెట్లు పడుతుంది? ॥తో॥
వెయ్యండిరా గూడ మెరక చేలోకి !
విడగొట్టరా నీరు బందచేలోది !
ప్రాజెక్టు నీరెల్ల
పైనమై వచ్చింది.
దమ్ము సిద్ధము గాక
వ మ్మవుతదో యేమొ ॥తో॥

నేపథ్యం నుంచి :

రైతు తొందరపెడుతూ వున్న కొలదీ, పని ఆలస్యమై పోతూ వుంది. క్రొత్త ప్రాజెక్టు నీరు పొంగులు వారుతూ వస్తున్నది. మంచి చురుకైన గిత్తల్ని కట్టి, బలమైన రైతు యువకులు ఎంత గింజుకున్నా చేలు దమ్ము కావడంలేదు. గిత్తల కాళ్ళు తొడలోతు దిగిపోయి ఊడి రావడంలేదు. నోరులేని జీవాలు ఊరికినే కొరడాదెబ్బలు తింటున్నాయి. అదనులో మూన పడకపోతే అనుకొన్న గింజరాలదు.

(సేద్యగాళ్ళు విసుగ్గా ప్రవేశిస్తారు, దమ్ము చేస్తూ)

సేద్యగాళ్ళు :

ఎహె ఎహె, ఎహె ఎహె,
ఎహెహే, ఎహెహే !
ఎద్దు కదలుట లేదు.
ఏరు సాగుట లేదు
ముంచు కొస్తున్నాది వాన -- ఇంక
కంచి పాలవుతాది మూన !
ఎన్ని ఎద్దుల జతలు
దున్నగల వీ నేల?
పార కొడితే ఎంత
మేర తెగుతుంది ?
దాటి పోతున్నాది పదును-- కరువు
కాటు వేస్తుందేమొ యెదను !
క్షణములో తొలకరిం
చెను, చల్లబడె భూమి,
గట్లు పొర్లేటట్లు
కాలువలు తెరిచారు.
పరువెత్తి పోతుంది కాలము-- ఇంక
పనికి రాదోయ్ పాతమేళము!

నేపథ్యం నుంచి :

ఈ విధంగా రద్దీకి తట్టుకోలేక రైతు ఉక్కిరి బిక్కిరై పోతున్న సమయంలో, అక్కడికి సోముడు వచ్చాడు. వ్యవసాయ శాఖలో మరనాగళ్ళను, బుల్డోజర్లను నడిపే ఉద్యోగం వాడిది. అతడు రైతు అవస్థను గ్రహించి ఆగి పల్కరించాడు.

(అప్పుడు సోముడు ప్రవేశిస్తాడు)

సోముడు :

ఏమయ్యో, ఓ రైతన్నా !
ఏదో ఇది పడుతున్నావు ?
అదునులోనె మూన పడిందిగదా !
ఆఖరు జేశావుగదా ఊడ్పులు ?

రైతు :

ఏరా, సోముడు ! నీవట్రా ?
ఏమి చెప్పమన్నావురా ?
ఎమ్ము విరగ పనిచేసిన గానీ
దమ్ము కాలేదురా చేలు !

సోముడు :

మెరకలకు నీరెక్క నందున
అరక లాపిరి పాలి కాపులు !
మునిగె పల్లములంచు -- నీటిని
మురుగు కాల్వకు విడుచుచుంటిమి !
అయ్యోరైతా !
అలస రైతా !
వానదేవుని నమ్మరాదని
వనరు లెన్నో కట్టుకొంటిమి.
కదలి మార్గం విడిచి గంగ
వెదలి వచ్చెను పంట కాల్వల
చూడు, రైతా !
వేడు, రైతా !

పండినను, ఎండినను, లెక్కే
వుండెడిది కా దితఃపూర్వము,
పండి తీరా లిపుడు, కోట్లకు
తిండి కావాలోయి రైతా !
పంట రైతా !
ప్రాణ రైతా !

రైతు :

నీవు చెప్పిన మాట
నిజమురా, సోముడూ !
కోట్ల కొలదీ ప్రజకు
కూడు కావాలిపుడు,
పనులన్ని నిమిషాల
పైని సాగాలి.
బులికిపోయినవి, తా
తల నాటి నాగళ్ళు,
అలసి పోయినవి, తం
డ్రుల నాటి దుక్కెడ్లు.
సాధనాల్ కాల దో
షము పట్టి పోయెరా !
కొంద్ర కొంచెము తాత
తండ్రుల నాటిదే,
కాలమా - వాయువే
గము తోడ పరిగెత్తు !
తోచకున్నది ఊహ,
తోవ కన్పడదురా !

సోముడు :

ప్రాజెక్టు తెరిచారు.
పవరు కలిగించారు.
సహకార పద్ధతుల
సాగు చూపించారు.
ఆధునిక కాలాన, రైతన్నా !
ఆశ కోల్పో నేల ? రైతన్నా !
మేఘాలను జయించి,
మెరుపులను కరిగించి,
సాగరాల్ నిర్మించి,
సారణులు భూషించి,
నీ చేల కంపేరు, రైతన్నా !
నీ సేవ జేసేరు రైతన్నా !
స్వర్గంగనే దింపి
సస్యాల కిచ్చేరు,
పాతాళగంగనే
పైకెత్తి పోసేరు.
విద్యుల్లతల చేత, రైతన్నా !
విధులు చేయించేరు, రైతన్నా !
గట్టుపై కూర్చుండి
కన్ను గిలికావంటె,
క్షణములో నీ పొలము
స్వర్ణమే పండదా ?
పాత పుంతలు మాని, రైతన్నా !
పద రాజ మార్గాన, రైతన్నా !

(ఇద్దరూ నిష్క్రమిస్తారు)

నేపథ్యం నుంచి :

రైతు కొత్తదారి తొక్కాడు. పొలంలో మరనాగళ్ళు, బుల్డోజర్లు ప్రత్యక్షమైనై, బుల్డోజర్లు మెరకలు తీసి పల్లాలకు పోస్తూ, పొలాలను సమము చేసుకుంటూ పోతూవుంటే, మరనాగళ్లు దమ్ము చేసుకొంటూ పోతున్నై. దుక్కిటెద్లు ఓర చూపులు చూస్తున్నాయి. పనివాళ్ళు ఉత్సాహ పడుతున్నారు. రైతు ఆనందిస్తూ వున్నాడు. ఊద్పు బహు వేగంగా సాగి పోతూవున్నది.

(కూలీలు ఊద్పు నటిస్తూ ప్రవేశిస్తారు)

కూలీలు :

ఆనందమయ్యింది, ఉయ్యాలా!
అభ్యుదయ మయ్యింది, ఉయ్యాలా!
ప్రకృతి శక్తులు మనిషి
పని కత్తెలైనాయి.
ప్రకృతిపై మానవుడు
ప్రభుత సాధించాడు,
యంత్రయుగమొచ్చింది, ఉయ్యాలా,
మంత్ర బలమిచ్చింది, ఉయ్యాలా!
భూమినే యెత్తగల
బుల్డోజ రొచ్చింది,
మెరక పల్లాలన్ని
సరిజేసి పోయింది,
కోటి పారల పనిని, ఉయ్యాలా!
గోట మీటేసింది, ఉయ్యాలా!
కరకు నేలలు చీల్చు
మరనాగ లొచ్చింది,

మహితలమ్మునె ఏక
మడి చేసి పోయింది.
మూరకొక మూనమ్మ, ఉయ్యాలా!
మూనకొక పుట్టెడే, ఉయ్యాలా!
పాత భూముల పాత
పద్ధతులు విచ్చాయి,
కొత్త నేలలు సాగు
కొచ్చాయి, మెచ్చాయి,
స్వర్ణాలు పండాయి, ఉయ్యాలా!
స్వర్గమని పించాయి, ఉయ్యాలా!
ప్రకృతి మాతే మనకు
పని చేసి పెడుతుంటె
యంత్రాలపై జీవ
యాత్ర పోతూవుంటె,
విశ్రాంతిగా మనము, ఉయ్యాలా!
వేడుకలు చేదామె, ఉయ్యాలా!

నేపథ్యంలో బృందగానం :

అంధకాలపు కంధరములో
బంధివై పడియున్న రైతా !
రాతియుగమున పాత గొంగళి
తాతవై పడుకొన్న రైతా !
లేచి రావోయ్,
లేత వయసుకు !
చిత్రకూటపు శిఖర కాంతుల
చిత్తమును వెలిగించుకోవోయ్ !

పద్మమిత్రుని ప్రభాకరముల
బద్ధకము తొలగించు కోవోయ్ !
లేచి రావోయ్ !
లేత యుగముకు !
యంత్ర హలమును మీట వోయీ !
మంత్ర బలమును చాటవోయీ !
చంద్రతారా మండలాలకు
చక్రపొంగలి పంచవోయీ !
లేచి రావోయ్,
లేత యూహకు !

# శ్రేయసి

(ప్రాచీన యుగంలో చిన్న రాజ్యము. రాజు నిరంకుశుడు. అతని రాచరికమునకు స్వస్తిచెప్పి, స్వరాజ్యమును ఏర్పరచుకొనవలెనని ప్రజల కోరిక. అందుకు బహుముఖాలుగా యత్నాలు జరుగుతున్న కాలమది.

వృద్ధరాజు ఇక ఎంతోకాలము పాలించడు కాని, యువరాజు చాల అసమర్థుడు, దుడుకువాడు. అతడు రాజ్యమునకు వచ్చి స్థిరపడిన యెడల ప్రజల ఉద్యమము ఫలించు అవకాశము తక్కువ. అది అప్పటి పరిస్థితి.

ఆ రోజు సాయంవేళ యువరాజు సూర్యదేవుడు, అతని ప్రియురాలు రాగిణీదేవి వాహ్యాళికై సముద్రతీరానికి బైలు దేరినారు.)

రాగిణీదేవి :

సంధ్యారాగము అనురాగమువలె
నమ్మదకరమై సాగుచున్నయది.
చరమాశా హృదయమ్ము చిట్లి, నె
త్తురు చిందిన దాకా శాంతరమున !

రాగములో -- అనురాగములో, ఈ
రక్తభాన మేమోయి ? ప్రభూ !
అందములో -- ఆనందములో ఈ
అందని తల పేమోయి ? ప్రభూ !

సాయం సంధ్యా విహారమున కిది
స్యందన మట్లగుపించు నేమిటో !
రక్తస్యందన మెక్కి సమస్తము
రాత్రి గలిసి పోనేమిటి కోయీ !

కాల భుజంగము విప్పిన ఫణలుగ
కనిపించును ఈ నీలాకాశము !
అరుణోదయములు, దీప్తాహస్సులు
అనంతు పాల్పడు కర్మయెందుకో !

(విహ్వాల హృదయ అయి ఆమె అశ్రుపూరిత అగును. అతడు ఆమె కరమును గ్రహించును.)

సూర్యదేవుడు :

చిత్రభావము తోచినది నీ
చిత్తమున ఈ నాడు, ప్రేయసి !
ప్రకృతి రాహస్యమును చక్కక
ప్రకటితము చేసితివి, చూడుమ.

అనంతము కాలమ్ము, అదియె స
హస్రఫణముల ఆదిశేషుడు
అతని పడగల నీడ జీవన
యాత్ర చల్లగ సాగిపోవును.

జీవనము వికసించి, పర్యవ
సించుచుండును మృత్యుమూర్తిని,
సుభగమౌ ఈ రూప కల్పన
చూచి మెత్తురు కాదె శూరులు ?

ఇంత సుందర దృశ్యమేలకొ
వంతరేపెను నీదు మదిలో !

అలసి సొలసిన జీవ జగతికి
వలదె మరి విశ్రాంతి? దేవీ !

రాగిణీదేవి :

అయితే, కాలము కాల సర్పమే
యందువ ? అది విష శీర్షకమౌటయు
తప్పదందువా ? దాని కోరలను
తప్పుకొనుటయే అసాధ్యమందువ ?

సూర్యదేవుడు :

తప్పుకొనుట అసాధ్యమే, అది
ధర్మవహమై సాగుచున్నది;
వ్రీలిపోవుటకన్న విరిసిన
వెనుక మల్లియ కేది మార్గము ?

పండిపోయిన వెనుక మామిడి
పండు రాలుట సహజమే కద ;
సహజ ధర్మము తప్పు కొనువా
డహి విభూషను డొక్కడే, చెలి !

ఈ రసోదయ సమయ మందిపు
డెందు కీ తత్త్వార్థ చింతన ?
సంధ్య ననురాగమున పోలిచి
డియ నేలను తమసి శోభకు ?

రాగిణీదేవి :

సాయం సంధ్యా రాగము నెందుకు
సరిపోల్చితినో అనురాగముతో !
పోల్చినంత నా హృదయ మెందుకో
పొగుల సాగినది తమోభీతితో !

అనురాగమ్మున కవసానముగల,
దదియు గాఢ తమ మన్న భావమే
దుర్భరమ్ము కద ? దాని నుండి యొక
త్రోవయె లేదా పారి పోవగా ?

సూర్యదేవుడు :

లే దనియె కద చెప్పితిని ? దిగు
లేల సుఖ హేతువును కన్గొని ?
ప్రేమ రాగోదయము సాయం
వేళ కే యగుట నైజము కద ?

దివ్యలోకము నుండి భూమికి
దిగు మనోజ్ఞత, ఉదయ రాగము;
భువికి దివికెత్తెడు పరేశ వి
భూతియే సాయాహ్నరాగము.

అమృత మయమౌ ప్రేమ జీవన
మంకురించు దివాంత మందే;
జగము నిద్రా ముద్రితముగా,
మిగులు పరమానంద మొకటే.

మృత్యు వెంతో సుందరము, అది
మూలశక్తి నవోదయమునకు;
ఆకు రాలక చిగురు పుట్టదు.
చీకటియె వెల్గునకు మూలము.

రాగిణిదేవి :

చీకటి కర్మాగారములోనే
జీవన విధాత నిర్మాణములా ?
ఆకు రాలు కాలము లేకే ఈ
లోకానికి మధు మాసము రాదా ?

సూర్యదేవుడు :

వెరపు గొల్పు విషయమునే
మరి మరి తలపోయ నేల ?
వేదాంతము విడిచి, ఇంక
వీక్షింపుము ప్రకృతి శోభ.

నీకె కాదు, ప్రకృతి కెల్ల
చీకటి వెలుగులు కలవు,
భావి చింతలేని ప్రకృతి
కీవు శిష్యురాల వగుము.

(కొంచెము దూరము ఇరువురు పరిక్రమింతురు. ఆమె భీత నేత్రయై ఇరు ప్రక్కల పరికించు చుండును.)

రాగిణిదేవి :

ప్రకృతి దేవి ఆశ్రమమున
ప్రథమ శిష్యురాల నేను,

కాని, ఏలా నే డింత వి
కారమ్మై భయపెట్టును !

సూర్యదేవుడు :

జీడి కొమ్మలలోన కోయిల
చేరి పాడుటయో వికారము ?
ఇసుక ముసుగుల నెంద్రకాయల
కొసరు ముద్దు లటో వికారము ?

రాగిణిదేవి :

తీర కామిని రాతి గుండెల
జేరి తట్టెడి జలధి ప్రియునిది !
ఊసర క్షేత్రమున రాగము
లొలుక బోసెడి రాజ రాజుది !

ఏది వికార మ్మనుచు చెప్పుదు ?
ఎల్ల జగములు సుకృత దుష్కృత
ఘర్షణములని తోచుచున్నది,
ఘనతపై హృది చిట్లుచున్నది !

సూర్యదేవుడు :

జలధి చాల గంభీరము,
తెలియలేము దాని లోతు,
రాతి గొండలను తట్టుట
రత్నాలుగ మార్చుట కేమో !

రాజ రాజు ప్రేమకు ప
ర్వత శిఖరములే స్థానమ?
చవుదు నేలలకు బారుట
సరసమ్ములొనర్చుట కేమో !

రాగిణిదేవి :

నడువ జాలకుంటి, ప్రభూ !
అడుగులు తడబడు చున్నవి;
బంగారపు టిసుక లోన
పంక శంక లిడుచున్నవి !

చూడు మివే యిరు ప్రక్కల
జీడి మామిడుల తోపులు !
ఆమోదమ్మునకు బదులు
ఏమో వెరపించు నన్ను !

(చేతికందిన ఫలమొకటి త్రుంచి ప్రియున కందిచ్చును)

ప్రభూ ! చూడు, మిదెంత చక్కని
ఫలమొ, తీయని తావు లీనుచు !
కొనుము, రుచిగొను, మిదే నో కద
గొట్టు ఫల మీ కొమ్మ నుండి--- !

సూర్యదేవుడు :

ప్రణయినీ ! ఆ నాటి ఆ మన
ప్రథమ దర్శన వేళ నీచే
గొన్న ఫలమున కన్న ఈ ఫల
మెన్నొ విధముల రుచ్య మైనది !

నా దెరుంగము ఒకరి నొకరము
నే దెరుంగుదు మొకరి నొకరము;
నాడు చేరిన రెండు వాగులు
నే డొకే ఆనంద వారిధి.

అదుగో నా పలుకే నిజమ్మని
అల నెలంతుక పదము లంటెను !
తథ్య మనె నదిగో వనమ్మున
తరుణ కోకిల మూడు మారులు !

చూడు, మదె, నా కీ వొసంగిన
చూత ఫలమటు సూర్యబింబము !
దిఙ్ముఖమ్మున రసము చిందుచు
దిగుచు నున్నది కదలి కంఠము !

ఏల దేవీ ! ఎన్న దెరుగను
బేల వైతి వకారణమ్ముగ ?
అలసి నట్లగుపించు చుంటివి.
అరుగుదము నగరమున కింతట ?

రాగిణిదేవి :

వలదు లెమ్మో ప్రభూ !
అలపు గాదో ప్రభూ !
నీ ప్రేమ భరమె న
న్నింతగా క్రుంగించే !

హృదయమ్ము త్రుంచి నీ
పదము లం దర్పించి,
ఆనంద వార్ధిలో
అంతరింతును నేడు.

నడువు మా రాతిపై
గడియసే పాగెదము,
కదలి ప్రేముడి త్రోసి
పెదమొగ మ్మిడిన దది.

(ఇర్వురును సముద్రములో మునిగి తేలుచున్న ఒక శిలపై కేగి కూర్చుందురు.)

సూర్యదేవుడు :

ఏమో ఈనాడు ప్రియా !
ఏదో విధముగ నుంటివి !
కల కల మని నీ వుండక
కలుగునె నా కానందము ?

అదిగో చూడు, మా ప్రక్కను
అస్తమించె మార్తాండుడు !
ఇదిగో ఈ దెస, చంద్రుడు
ఉదయింపగ లే దింకను

అస్తోదయ సంధ్య కాల
మవధానంబున కనుమా !
కాంతా ! ఇది కదు విప్లవ
కరముగ దోచును కాదే !

మన రాజ్యములో నుండిన
జనతా సంఘములు వోలె
చెల్లా చెదరై పోయెదు
నెల్లెడ పక్షుల మూకలు !

కార్యాంతర గతుడై చను
కాంతుడు కనుమరుగైన స
తీ తిలకము వలె నీరే
జాతము ముకుళించిన దదె

రాగిణీ దేవి :

హృదయము హృదయము ప్రేమ ప
రీ రంభములో నలిగిన
నలినిని నిర్దయతో విడ
నాడిపోవు దినమణి క్షం
తవ్యుడగున నీ దృష్టికి ?
రవి తన కరములు సాచి ఉ
రస్థ్సలమున జేర్చుకొన్న
జలాణువులు వినీలోగ్ర
జలదములై యిను మ్రింగుట
క్షంతవ్యమ నీ దృష్టికి ?

సూర్యదేవుడు :

ప్రేయ స్సని, శ్రేయ స్సని
పృథ్వి నడరు ద్విగుణమ్ములు
ప్రేయో యజనమ్ము వలన
శ్రేయస్సు ఫలించు చుందు.

నీ ప్రేమకు పీఠమైన
నేను కలిమి కన్న లేమి
నే, బ్రతుకున కన్న చావు
నే, ప్రియముగ స్వీకరింతు

రాగిణిదేవి :

బలవత్తరమైన హేతు
వగుపరచుచు, ప్రభూ ! నిన్ను
హత్య చేయ దలతునేని
ఆదరమున గైకొందువ ?

ప్రియురాలను నాపై నే
మియు క్రోధము జనియింపద ?
పరలోకము లోన నన్ను
చరణ దాసిగా కొందువ ?

సూర్యదేవుడు :

**ప్రియా ! నేడు నీ నుడువులు**
**వింతగొల్పు చుండె నాకు,**
**వలతువేని రాజ్యమ్మె**
**వదలుదు నీ ప్రేమ కొరకు.**

ప్రేమించితి నిన్ను, దేవి !
ప్రేమించితి మనసారగ,
నీ విషమ పరీక్ష లింక
నిల్పి, ప్రియా ! నన్ను నమ్ము !

ప్రణయ సఫలతకు నే నిను
పరిణయమాడుదు త్వరలో,
పరిణయ సుముహూర్త మందె
పట్టమహిషి జేతు, దేవి !

రాగిణిదేవి :

స్వామీ ! నే నా యోగము
స్వర్గములో పడతు నేమొ !
ఇంత మంచి వాడ వంచు
ఎంచనైతి నేను, ప్రభూ !

ప్రజలను నిలువెల్ల దోచు
కుజనులు సమ్రాట్టు లంచు
భావించితి, వారిలోన
దేవతలును నుండు టెరుగ !

సూర్యదేవుడు :

విప్లవ భావములు నాకు
వెగటు గొల్పు నైజముగా;
కాని, అవ్వి నీ పెదవుల
తేనె జల్లులైన విపుడు !

ఉల్కి పడెదవేల? బాల !
ఉరుతర ధీరత్వ నిధివి !
వీరము గైకొని యుండియు
భీరురాల వయ్యెదేల ?

(సమీప నికుంజాలలో ఏదో అలికిడి విని, ఆగిపోవును. అతడు చూచును. ఆమె గుప్తముగా నుంచుకొన్న కరవాలమును పైకితీయును!)

రాగిణీదేవి :

కరవాలమ ! ఓహో ! ఓ
కరవాలమ ! విషనాగమ
ప్రియ కుసుమ ద్వయ గుచ్ఛము
విడగోయుట నీ తరమా ?

ప్రభూ ! దీని కై దాల్చుము !
పాపాత్మను నను నరకుము !
నరక ద్వారముల నుండి
నను రక్షింపుము దేవా !

సూర్యదేవుడు :

ప్రియురాలా ! భయపడకుము !
భయ మేలా నా కౌగిట ?
రాజకుమారుడను సుమ్ము.
రా రెవ్వరు మనమీదికి.

రాజ్యములె దండెత్తిన,
రాక్షసులె పైబడినను,
న న్ననిలో ఓర్వలేరు;
నను నిను విడదీయ లేరు.

కర్తవ్య విమూఢ మీ్మ
కరవాలము పట్టి తేల ?
లోహమయంబౌ కత్తికి
ఊహా పోహలు కలుగునె ?

కన్నీ రేమిటి కిప్పుడు ?
కర్తవ్యము బోధింపుము !
నీ యాజ్ఞకు బద్ధుడనై
నిముసములో సమకూర్తును.

రాగిణిదేవి :

ప్రియా ! వినుము నా చరితము.
వెల్లడింతును రహస్యము
పట్టణ జనతా సంఘపు
ప్రథమ సభ్యురాల నేను-

సూర్యదేవుడు :

చెప్పుము ప్రియ ! అణువైనను
చెదరలేదు నా చిత్తము;
ఒలికింపకు కన్నీటిని
ఓపలేదు నా హృదయము !

రాగిణిదేవి :

కన్నబిడ్డ అట్లు ప్రజను
కాపాడ వలసిన ప్రభువు
ఇబ్బందుల నాలించక
హింసల పాల్సేయ సాగె !

తాబేదారుల మాటయె
తనకు వేదవాక్య మాయె
తిండికొరకు కేల్చాచిన
దీనులు దుర్మార్గులైరి !

ప్రభువును లోబరచుకొన్న
స్వార్థపరులె పాలకులై
దోచుకొనుచు ప్రజల బ్రతుకు
దుర్భర మొనరించు చుండ్రి ?

మాన ప్రాణముల విలువ
మాయ మయ్యె రాజ్యములో,
రాజుండియు లేనటులె అ
రాజకమ్ము తాండవించె.

పరిస్థితులు చెప్పబోవు
పరువుకల్గు వారి గూడ
అవమానము చేసి పంపు
టలవాటైనది నృపతికి

ఆస్తిపాస్తులకు భద్రత
అభిమతముల కభయముద్ర
మానినులకు మానరక్ష,
లేనప్పు డికేమున్నది ?

రాజరికము గూల్చి, ప్రజా
రాజ్యము నెలకొల్పు టొకటె
గత్యంతరమై తోచెను
కడకు ప్రజానీకమునకు.

శాంతి భద్రతల కోసము
స్వరాజ్యేచ్ఛ పెల్లుబికెను.
ప్రజా రాజ్యమును నిల్పగ
ప్రయత్నాలు సాగజొచ్చె.

రకరకాల ఉద్యమాలు
రంగములో ఉరకెత్తెను.
రకరకాల విధానాలు
రక్తములో రగులుకొనెను.

క్రూరుడైన భూపాలుని
కూర్మి సుతుడవైన నిన్ను
హత్యచేయు కుట్ర యొకటి
అంతర్భాగము దీనిలో !

విషతరువును కొట్టునపుడు
విరుల తీవెయును తెగునటు
అనపరాధివైన నిన్ను
హత్యచేయ దలపెట్టిరి !

ఎన్ని ప్రయత్నములకైన
ఎన్ని వ్యూహములకు నైన
చిక్కవైతి వెన్నాళ్లకు !
చిత్రమయ్యె నీ శక్తి !

అందు కొరకు, దేవ ! నేను
అంతిమ యత్నమును చేయ
పూనుకొంటి; కష్ట సాధ్య
మైనది నీ చెలిమి నాకు.

ని న్నాకర్షించుటకే
నృత్యకళను నేర్చుకొంటి,
సమర క్రీడాలయమున
సభ్యురాల నైతి నేను.

నిను రంజించుట కొరకే
ప్రణయ విభ్రమమ్ము లభ్య
సించితి, రాజ్ఞీ వేషము
లెంచి యెంచి తాల్చినాము.

చాల కష్టపడితి నేను,
సఫలీకృత నైతి నేడు;
అయినను విధి తలపెట్టిన
అపకృతిలో పడిపోతిని.

నిను రంజింపగ పూని
నీ యెడనే రంజిలితిని
నిను వాగుర బట్టదలచి
నేనే వల దగులుకొంటి !

సూర్యదేవుడు :

చెప్పుము, సఖి ! ఇన్నినాళ్ళు
చెప్పవైతి వీ చరిత్ర !
కరణా రసవార్ధి నింత
కాలము వాగనుకొంటిని !

రాగిణిదేవి :

ము న్నే చెలి కారమ్మును
మోహింపగజేయ లేని
నా హృదయాయః పిండము
నీ హాసములో కరగెను !

కామింపగ జేయబోయి
ప్రేమించితి నేనె, ప్రభూ !
జీవితమే నీ పద రా
జీవములను జేర్చినాను

ఒక్క ప్రక్క కర్తవ్యము
ఒక్క ప్రక్క ప్రేమ ధనము
కాల్చివేయ సాగె నన్ను
కాలానల కీల లగుచు.

ఒక్కగుప్పిట ప్రజల కార్యము
ఒక్క గుప్పిట ప్రణయ భావము,
రెండు గుప్పిళ్లగ్నివలె రవలై
మండి బ్రతుకును కాల్చి వేసెను.

ఎంచుకొంటిని, స్వామి ! నేటికి
హృదయపాత్రనె పగులగొట్టగ,
ప్రజల సుఖమే ముఖ్య మయ్యెను
ప్రభూ స్వార్థ ప్రేమ ముందర.

అందుకొరకే నేడు, ఈ సం
ధ్యా విహారము నిర్ణయించితి;
పొంచియున్నారీ కురంగట
పొదల లోపల ప్రజల భటులును.

సూర్యదేవుడు :

మొదలె చెప్పితికాదె, నీకై
హృదినికోసి యొసంగ గల నని ?
సకియ చేతులలోన ప్రాణము
చనుట కంటెను భాగ్య మున్నదె ?

నీ పరిష్వంగములో నే
నిమీలిత నేత్రుడుగ నుండెద;
కౌగిలిని సడలింప కుండగ
కత్తి దింపుము గుండెలోనికి !

శరీరము చల్లబడు వరకును
సఖీ ! కౌగిలి బిగువు వీడకు !
నా యస్పృగ్గత వాంఛ లన్నియు
నీ యసిన్ మరి యింకనిమ్మా !

స్వరాజ్యము నెలకొల్పి, ప్రజలకు
శాంతి సుఖము లొసంగి, తదుపరి
స్వర్గమున నను కలిసి కొమ్మా !
క్షణము యుగముగ వేచియుందును.

(అతడు కన్నులు మూచికొని ఆమె యొడిలో ఒరిగిపోవును. రాగిణిదేవి కరవాలము పైకెత్తి పట్టుకొని---)

రాగిణీదేవి :

ఇదియెకా మానవత భువి, నీ
కివియె కొను జోహారులు, ప్రభూ !
ఇదియె కాపూరుషత భువి ! నీ
కివియె కొను నా పూజలు, ప్రభూ !

ఇదియె కా ప్రేమైక తత్వము
ఇవియె కొను నా యసువులు, ప్రభూ !
ఇదియె కా శ్రేయస్సు భువి, నీ
కిదియె కొను మాత్మార్పణం, ప్రభూ !

(సూర్యదేవుని బిగియార కౌగిలించుకొని, రాగిణిదేవి తననుతా పొడుచుకొనును. తల్లడిలి అతడు లేచునంతలోనే ఆమె అతనిపై వాలిపోవును. బిల బిల మనుచు చాల మంది సాయుధ ప్రజలు దగ్గరి పొదలనుండి ఒక్కుమ్మడిగా వచ్చి. వారిని చుట్టు

ముట్టుదురు. వారిని లక్ష్య పెట్టకయే ఆమె చికిత్సకు పూనుకొన్న సూర్యదేవునిపై ఒకడు కత్తి నెత్తగా వారి దళవాయి వారించును. గర్జాదుర్దినమువలె ఆ సమూహ మాందోళనలతో ఘూర్ణిలి యల్లలనాడినది. అందొక పెద్దవాడు ఆమెను పరీక్షించి, భయము లేదను సైగతో, నలుగురి సహాయముతో ఆమెను చికిత్సకై కొనిపోవును. మూర్తీభవించిన విషాదమో యన శిలాకృతి వహించినసత్త్వమో యన సూర్యదేవుడు లేచి నిలబడినాడు. తూర్పున చంద్రుడుదయించుచున్నాడు.

దళవాయి :

వింటిమి మీ సంభాషణ
వెన్నంటే -- వచ్చుచు.
కంటిమి మీ త్యాగనిరతి
కన్నులతో చూచుచు!

ప్రాణ భయము తప్పెను మీ
ప్రాణేశ్వరి రాగిణికి
కైమోడ్చెద మందరమును
కరణామయు శివునికి !

ఇదిగో ఇది కరవాలము.
ఇదిగో ఇది పతాకము.
ప్రజా నాయకత్వము నీ
పరమైనది, కొనుము !

సూర్యదేవుడు :

వలదు, వలదు, నా కోసము
వదల వలదు ఉద్యమము,
మానవుడొక్కని కంటె స
మాజ సుఖము కదు ఘనము.

ప్రకటించుచు నుంటి నేడు
ప్రజారాజ్య పాలనము,
స్వరాజ్యము నిర్మింతము.
సురాజ్యమ్ముగా మనము !

మన యీ నిర్ణయమును భూ
పునికి నివేదింతము,
రే పుదయము నుండియే ప్ర
జా పాలన నడిపింతము !

అందరు :
సూర్యదేవు డుదయించెను.
సుధాకరుడుగా నిపుడె.
నిరాశాంధకార మెల్ల
నిరస్తమై యడగే !

స్వరాజ్యమ్ము వచ్చిన దిక
నిరంకుశత లేదు,
ప్రజా స్వామికమునకు స్వ
ర్గమును ఈడు రాదు.

ప్రేయస్సే చూసె నేడు
శ్రేయస్సుకు సుగతి
నిస్వార్థ ప్రేమముతో
నింపెద మీ జగతి !

(సూర్యదేవుడు జాతీయ పతాకము చేతబట్టినాడు. అప్పటికి సూర్యోదయమైనది. స్మృతి తెలిపిన రాగిణిదేవితో కలిసి, అందరును కోటలోనికి పురోగమించినారు.)

# పాతఊరు - కొత్తదారి

(ఇద్దరు ప్రయాణీకులు. దారి వెదుక్కుంటూ ప్రవేశిస్తారు. పల్లెటూరి వేషం. చాల దూరం నుంచి వస్తున్న లక్షణం. అంతా కొత్తగావుంది వారికి. వారి పేరులు బాలకృష్ణయ్య, బలరామయ్య. దారే పోయే వాళ్ళని దారికోసం అడుగుతుంటారు. అందుకు సంబంధించిన ఈ పాటను ఇద్దరూ కలిసి, ఒకరి తరువాత ఒకరూ, వీలును బట్టి పాడుతూ ముందుకు సాగుతారు.)

బా, బ. :

దారి ఎవరైన చెపుతారాండి ? బాబు ?
ఊరి కెళ్ళేదా రిదేనాండి ? బాబు !
తెలుసు ననుకొన్నాము.
తెరువు తప్పేశాము.
సంద లడిపోతేను
బందలను పోలేము ॥దా॥
ఇక్కడే వుండాలి ఒక చిన్న డొంక
పక్కగా పోవాలి పాపన్న లంక,
దారి పొడుగున ముళ్ళు,
జారిపడితే, చెల్లు !
పొద్దు గూకిందంటె
పెద్దలకె గడగళ్ళు ॥దా॥
మా వూరు ఇది కాదొ ? మరిచి వొచ్చామొ ?
ఏ వూరు వొచ్చామొ ? ఇపుడేమి దిక్కొ ?
చాల దూరమునుండి

సాగి వచ్చామండి;
పాతవాళ్లమె కాని,
గోత బద్దామండి ॥దా॥

(అంత వారికి ఎదురుగా సైకిలు నడిపించుకొంటూ వలంటీరు కుర్రవాడు వస్తాడు. అతని పేరు ఎరుకయ్య. అతడు ఆగి, వారి మాటలు వింటాడు. పలకరిస్తాడు.)

ఎరుకయ్య :

ఎవ్వరయ్యా, మీరు ?
ఎందు కటు పోతారు ?
దారిలే దటు కేసి,
ఊరు లే దటు ప్రక్క
కంచె కట్టిన తోట
కనిపించడం లేద?
ఎటనుండి వచ్చారు ?
ఏ వూరు పోతారు ?
ఆమదలుగా నడిచి
అలసినట్లున్నారు !
దారి తప్పిన బాట
సారుల ట్లున్నారు !
కొత్త దేశము జూచు
కోర్కెతో వచ్చారో ?
పల్లెలో ఏదైన
పని వుండి వచ్చారో ?
అటు దారి లేదండి !
ఇటు కేసి మరలండి !

బా. బ. :

దేవుడే మొరాలకించి
తోవ చూప వచ్చెనయ్య !
దిక్కులేని రాత్రి ఇందు
కుక్కచావు తప్పెనయ్య !

కొత్త వాళ్ళు కాము, కాని
కొత్తగుంది ప్రాంతమెల్ల !
దారి తెన్నులేని మాకు
దైవమట్లు దొరికి తయ్య !

పల్లెటూరు పోదమంచు
పట్నమేదో చేరినాము !
ఇంద్రజాల మేదొ మమ్ము
ఇందు తెచ్చి త్రిప్పు నేమొ !

చిక్కు విప్పి, మాకు దారి
దిక్కు చూపి మనుపుమయ్య !
కుద్రవాడ వైన గాని
క్రుష్ణమూర్తి వౌదువయ్య !

ఎరుకయ్య :

పట్నమిది కాదండి !
పల్లెటూరేనండి
పాపన్న లంక కిది
పకడైన రోడ్డండి !

ఏ పల్లె వారండి మీరు ?
ఇన్నేండ్లు
ఏ లోక మం దుండినారు ?

బా, బ :

పాపన్న లంక కిది
పకడైన రోడ్డా?
బళ్ళు పోతున్నాయి !
బసులె వస్తున్నాయి !
మురికి డొంకేమైన దిక్కద ?
తొడలోతు
బురద గుంటుండేది అక్కద !

ఎరుకయ్య :

ఔనండి, అదియెల్ల
ఐదేళ్ళ క్రితమండి !
ప్రాతకాలం లోనే
బ్రతుకుతా రేమండి ?
ఎంతో మారుపు వచ్చెనండి !
దేశమే
ఎంతో ముందుకు పోయెనండి !
బండిపై వెడతారా ?
బస్సెక్కిపోతారా ?
నలుదెసలు కనుగొంచు
నడిచి పారేస్తార?
ప్రొద్దుగూకే తలికె సుళువుగా
మీరు
పోవచ్చు, నడవండి తిన్నగా !

(రోడ్డును చూపించి, ఎరుకయ్య తన దారిన తాను పోతాడు. బలరామయ్య, బాలకృష్ణయ్య ముందుకు పరకాయించి చూచి, నడక లంకించు కుంటారు. వారికి అంతా కొత్తగా కనిపిస్తున్నది. ఆశ్చర్యంగా వుంది. డొంకంతా బాగుచేసి మెయిను రోడ్డు నుంచి తమ వూరికి ఇంత చక్కని రోడ్డును ఎవరు వేశారో ? వారు దూర దేశంలో పనికోసం పోయి ఐదేళ్ళయింది. ఇంతలో ఎంత మార్పు.)

బలరామయ్య :

పనుల్ లేక, పొట్టచేత పట్టుక మనము
పట్టణాలు చేరినాము పొట్టకోసము,
అదే చూడు ! రోడ్డు కిటూ, అటూ వందలాది
ఆడ, మగా చేరి కడుదు రద్దుకొన్న నది !

బాలకృష్ణయ్య :

బలే వంతెనోయి ! బలే పసందైన వంతెన !
వంతెనతో ఆనకట్ట, వరావంటి యోచన !
ఊరందరి కిదే పెట్టు ఓపినంత తిండి !
దారి చూపుతున్న ధర్మ తండ్రు లెవరొనండి !

బలరామయ్య :

కొత్త వింతలను చూపుతు ప్రొద్దుగూకిపోయె,
ప్రొద్దు చిన్న చిన్న వెలుగు ముద్ద అట్లు రాలె !
ముళ్ళదారి, మురికి దారి కళ్ళముందె రోడ్డయ్యె !
ఒళ్ళు జల్లుమను చీకటి ఒక్కసారె వెలుగయ్యె !

బాలకృష్ణయ్య :

మాటల సందట్లోనే
మన వూరొచ్చినట్టుంది !

మన వూరో కాదో యిది !
మాయ మంత్ర మట్లుంది !

బలరామయ్య :

అనుమానం లేదు, చూడు,
అదె మామిడి తోట !
తెచ్చు జ్ఞప్తి కప్పటి కో
తి కొమ్మచ్చి యాట !

బాలకృష్ణయ్య :

మామిడి తోటకు ప్రక్కనె
మాలపేట వుండేది !
కనిపించుట లేదిప్పుడు
కాలిపోయి వుంటది !

ఊరు వెలుప లుండు తోట
ఊరు మధ్య కొచ్చింది !
పట్నంలో వలెనె రాత్రి
పట్ట పగలుగా వుంది !

బలరామయ్య :

ఉనికె ఇంత మారిందే !
మనుషు లెంత మారారో !
కొత్తదనంలో మనల్ని
చెత్తలాగ చూస్తారో !

పనికోసం వెతుక్కొంటు
పల్లెను విడిచాము మనము.
పనివాళ్ళను పెంచుకొంటు
పల్లియ విడిచినది మనల !

(అంతలో అక్కడికి ఎరుకయ్య వస్తాడు. సైకిలు దిగుతాడు. గ్రామ సమీపంలో రోడ్డు ప్రక్కన తచ్చాడుతున్న బాలకృష్ణయ్య, బలరామయ్యలను చూస్తాడు. పల్కరిస్తాడు)

ఎరుకయ్య :

మీరు అడిగిన ఊరిదే గద ?
దారి తప్పక వచ్చితిరి గద ?
కొత్త రోడ్డిది, ఇంక కొంచెం
మెత్త బడవల సున్నది.

బురద గుంటలు పూడ్చి పెట్టి,
బోదెలకు వంతెనలు కట్టి,
ఎత్తు పెంచి, రోడ్డు వేయుట
కెంతయో శ్రమయైనది.

తెరువు పొడవున, రెండు ప్రక్కల
తీయ మామిడి చెట్లు నాటిరి;
తెర్వరికి శ్రమబాపి, ఆకలి
తీర్చవలె నంచు.

మేఘవనములు వెదకి, త్రవ్వి,
మెరుపు తీగలు తెచ్చి నారట !
దారి పొడవున పూచి మల్లెలు,
ఊరె వికసించె !

బా, బ :

చాల చిత్రం, విచిత్రం ! ఈ
శ్రమంతా పడ్డ వారెవరో !
రాజ బాటకు, పల్లెటూరికి
రాజి చేసిన దెవ్వరో !

చాల చిత్రం, విచిత్రం ! ఈ
జనాలను మేల్కొల్పి రెవరో !
సాముదాయక చింత గల, ఆ
సహజ నాయకు లెవ్వరో !

వత్సరం పండ్రెండు నెలలూ
వర్ణకక్షల, వర్గ కక్షల
కొట్టుకొని చచ్చేటి ఊరొక
కట్టడికి వచ్చిందె ! చిత్రం !

ఊరి వెలుపలి మాలపేటకు
దారి తెన్నులు లేవు పూర్వం,
పేటే కనపడ దిపుడు, వెన్నెల
తోటె అయ్యెం దూరు ! చిత్రం !

ఊరి లోపలి మురికి కంతా
ఊరి వెలుపలి పేట మచ్చు.
గచ్చు అరుగుల భవంతీలకు
రొచ్చు గుడిసెల బ్రతుకె చిచ్చు.

రొచ్చు మచ్చులు తుడిచి వేసి,
చిచ్చు నెరసులు ఆర్పి వేసి
మనుషులందరి మేలు కోసం
మనసు విప్పిందెవరో !

ఎరుకయ్య :

ఔను మీరన్నది నిజమ్మే;
అగ్గి నిప్పుల వంటి యువకులు
గ్రామ సారథ్యమ్ముగొని, సం
క్షేమ రాజ్యం చేయసాగిరి.

మురికి గుంటలు పూడ్చి పెట్టిరి.
మురికి పేటలు తుడిచి పెట్టిరి
మాల, సాలె విభేద భావం
మాని, గ్రామము నొకటి చేసిరి.

భూమి దానం, గ్రామ దానం,
పుష్కలమైన శ్రమదానం,
ప్రజ నినాదం, ప్రభు విరాళం
పల్లె కొసగెను పునర్జీవం !

చూడు డవిగో ! వీధు లన్నీ
సూర్యచంద్రుల నిల్పుకొన్నవి !
సమితి కార్యాలయమె సంస్కృతి
శారదకు ఆస్థానమైనది !

పంచవర్ష ప్రణాళిక సా
ధించి నట్టి పురోభివృద్ధిది;
గాంధి దేవుని మహిమ చూతురు
గాని, రండిక లోనికి !

(ఎరుకయ్య సైకిలుతో ముందు నడుస్తుండగా, బలరామయ్య, బాలకృష్ణయ్య ఆశ్చర్యంతో చుట్టూ చూచుకొంటూ, ఆ పునర్నిర్మిత సుందర గ్రామంలోకి ప్రవేశిస్తారు.)

# సుభాస చంద్రుడు

(ఒక ప్రక్క భవనాలు, ఒకప్రక్క పూరి కొంపలు, తోటలు, అడవులు మున్నగు వాటితో అలంకరించబడియున్న రంగం. నేపథ్యం నుంచి మధ్య మధ్య కథ చెప్పబడుతూ వుంటుంది. మధ్య మధ్య పాత్రలు వస్తూ, పోతూ వుంటాయి. భారతవాణి చేతిలో జాతీయ పతాక వుంటుంది. సుభాస చంద్రుని వెంట కొంత మంది యువకులు వుంటూ వుంటారు నిత్యం.)

నేపథ్యం నుంచి :

పర-- నిరంకుశ--సాయుధ పాలనమ్ము
తొలగు నటు లేదు మంచిమాటల నటంచు
విప్లవమునకు తలపడ్డ వీరమూర్తి !
అమర నేతాజి ! జోహారు లందుకొమ్ము !

1897 వ సంవత్సరం, జనవరి 22వ తేదీన, కటక్ నగరంలో జన్మించాడు నేతాజీ సుభాస చంద్రబోసు. తండ్రి జానకీనాథబోసు, తల్లి ప్రభావతీ దేవి. పుణ్యమూర్తులైన ఆ తల్లి దండ్రులకు ఎనమండుగురు పిల్లలు. ఐదుగురు ఆడపిల్లలు. వారిలో ఆరవవాడు సుభాస చంద్రుడు.

సుభాస చంద్రుడు పుట్టడంతో, భారత ధాత్రీ మాత ఆనంద బాష్పాలు రాల్చింది.

**పారతంత్ర్యపు గాఢాంధకార మందు**
**పర్వచంద్రుడు తోచె, సుభాస చంద్రు ;**
**డిక తరింతు నుషస్సు నీక్షింతు నంచు**
**భారతము రాల్చె ఆనంద బాష్ప శతము.**

పుట్టగానే పరిమళించిన పుష్పమై, బాల్యంలో తల్లి దండ్రులకు, సోదరులకు, విద్యార్థి దశలో ఉపాధ్యాయులకు, సహచరులకు ముద్దును, మురిపాన్ని, ఆనందాన్ని, ఆదర్శాన్ని కలిగిస్తూ, సుభాసచంద్రుడు 1919లో బి.ఎ. పరీక్షలో ప్రథమ తరగతిలో ఉత్తీర్ణుడైనాడు. ఇక భావి కర్తవ్యం ?

(అప్పుడు సుభాసచంద్రుడు ప్రవేశిస్తాడు)

**సుభాస చంద్రుడు :**

భావి కర్తవ్యానికేముంది? భారత స్వాతంత్ర్య సంగ్రామంలో దూకడమే.

నేపథ్యం నుంచి (స్త్రీ కంఠం)

సుభాస బాబూ !

**నేపథ్యం నుంచి :**

కర్తవ్యాన్ని నిశ్చయించుకొంటున్న సుభాస్‌కు వినిపించిన మృదు మధురమైన వాత్సల్యపూరితమైన అ కంఠం ఎవరిదో కాదు. తన అంత రాత్మతో ఏకీభావం పొందిన భారత మాతది. తరతరాల దాస్యంనుంచి విముక్తి పొందడానికి విలవిలలాడి పోతున్న తన మాతృభూమి కంఠం. భారతవాణి అది.

(అప్పుడు భారతవాణి ప్రవేశిస్తుంది)

**భారతవాణి :**

సుభాస బాబూ !

**సుభాస :**

అమ్మా !

**భారతవాణి :**

భారత స్వాతంత్ర్య సంగ్రామ రంగంలో దూకడమే నీ నిర్ణయమా ?

**సుభాస :**

ఔనమ్మా, ఔను !

**భారతవాణి :**

మరి, నీ తల్లిదండ్రుల అభిలాష ?

**సుభాస :**

వారు నన్ను ఐ.పి.ఎస్. చదవడం కోసం ఇంగ్లాండు వెళ్ళ మంటున్నారు. అది నాకిష్టం లేదు. నేను వెళ్ళను.

**భారతవాణి :**

వారికి నీ మీద ఎన్నో ఆశలు వున్నాయే !

**సుభాస :**

వారికి ఇంకా, నన్ను మించిన బిడ్డలు చాలమంది వున్నారమ్మా ! దేశంకోసం నన్నొకణ్ణి త్యాగం చెయ్యగలరు వారు.

**భారతవాణి :**

తల్లి దండ్రులకు ఏ బిడ్డ కా బిడ్డే ప్రత్యేకం, బాబూ ! వారి మాట కాదనకు !

సుభాస :

దేశ స్వాతంత్ర్యోద్యమాన్ని కాలరాస్తూ రౌలట్ శాసనాన్ని ప్రవేశపెట్టిన క్రూరులు, పంజాబ్ దురంతాలలో దేశభక్తుల పవిత్ర రక్తాన్ని వరదలు పారించిన రాక్షసులు ఇక్కడ నా మాతృదేశాన్ని శృంఖలాబద్ధంచేసి, నా ప్రజలను దోచుకుంటుండగా -- అట్టి దుండగుల దేశానికా నన్ను పొమ్మంటున్నావు? తల్లీ! ఇన్నాళ్లూ నీవు దాస్యాంధకారంలో వెలుగు కోసం కఠోర తపస్సు చేస్తున్నది వీర పుత్రుల కోసమా ? పరాన్న భుక్కుల కోసమా?

భారతవాణి :

ఉద్రేక పడకు బాబూ ! నేను నీలో కోరెది స్వాతంత్ర్య సమర వీరాధిపత్యం. అందుకు నీవు సర్వసాధనోపేతుడవు కావలసివుంది. నీవు ఇంగ్లాండు వెళ్ళడంలోనే నీ కది సిద్ధిస్తుంది వెళ్లిరా.

(ఇద్దరూ చెరోవైపుకి నిష్క్రమిస్తారు)

నేపథ్యం నుంచి :

సుభాస చంద్రుడు ఇంగ్లాండు వెళ్లక తప్పిందికాదు. శరీరం ఇంగ్లాండులో వున్నా -- అతడి మనస్సు, హృదయం భారతదేశంలోనే వుండిపోయాయి. అక్కడ ఐ.పి.ఎస్ పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, అక్కడ ఆంగ్లేయులకు తన మహత్తర ప్రతిభను ప్రదర్శించి, తన ఐ.పి.ఎస్. కు రాజీనామా ఇచ్చి, బ్రిటిష్ ప్రభుత్వం గుండెల్లో దడపుట్టించి, 1921లో సుభాస్ భారతదేశానికి తిరిగివచ్చాడు. వెంటనే గాంధీజీ ఆశీర్వాదాలు పొంది, కలకత్తా వెళ్ళి దేశబంధు చిత్తరంజన్‌దాసుతో చేరాడు. అప్పటినుంచి 1941 వరకు ఇరవై ఏళ్ళపాటు ఆయన జీవిత చరిత్ర భారతమహాసంగ్రామ చరిత్ర.

నేపథ్యం నుంచి :

దేశదాస్య విమోచ నాశయ దీక్షలో
జీవితార్థములు యజించినాడు.
"ఫార్వర్డు" పత్రిక బట్టి స్వరాజ్య పా
ర్టీకి గెల్పును సంతరించి నాడు,
అతి ధీరమతి నసహాయోద్యమము లెన్నొ
నడిపించి, జైళ్ళలో నలిగినాడు;
అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడై, ఉద్య
మ రథమ్ము నొక మొన మలిపినాడు.
బ్రిటను కష్టమ్మె భరత ధాత్రికి సమంచి
తావకాశము ముక్తి నటంచు యువక
పౌరుషమును ప్రేరేచి, ఫార్వర్డు బ్లాకు
పార్టీ నిర్మించినాడు సుభాసు అపుడు

(అప్పుడు సుభాసు చంద్రుడు ప్రవేశిస్తాడు -- చాల మంది యువతీ యువకులతో)

సుభాస :

స్వాతంత్ర్య సాధన కోసం తీవ్రమైన రాజకీయ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఫార్వర్డు బ్లాకును నిర్మించాం. వివిధ రాష్ట్రాలకు సర్దార్ శార్దూల సింగ్, రూయికర్, శీల భద్రయాజి, హరివిష్ణు, రామత్, రాజమన్నార్ చెట్టి మున్నగువారు పార్టీ అధిపతులు. ఆంధ్రలో ---

(సభ్యులలో నుండి సూచనలు)

మద్దూరి అన్నపూర్ణయ్య
మద్దూరి అన్నపూర్ణయ్య

సుభాస :

ఔను, అకుంఠిత దేశభక్తుడు, విప్లవయోధుడు, శ్రీ అన్నపూర్ణయ్య ఆంధ్రలో పార్టీ కార్యక్రమం నిర్వహిస్తారు.

అన్నపూర్ణయ్య :

నా శక్తి వంచనలేకుండా నేను కృషి చేస్తాను సుభాస్ బాబు !

సుభాస :

మన దేశీయులందరికీ విజ్ఞప్తి చెయ్యండి. బానిసలుగా బ్రతకడం కంటె చావడం మేలని హెచ్చరించండి. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం ప్రాణాలను బలిదానం చెయ్యడానికి వెనుదీయకండి. సామ్రాజ్యవాదంతో తుది పోరాటానికి ప్రజల్ని సిద్ధపరచండి.

అన్నపూర్ణయ్య :

జాతి జీవించడం కోసం వ్యక్తి ప్రాణాలను కోల్పోవలసి వస్తే అందుకు మాలో ప్రతి యువకుడు సిద్ధం.

(సభలో నుండి కేకలు)

సిద్ధం ! సిద్ధం !

(అంతా నిష్క్రమిస్తారు)

నేపథ్యం నుంచి :

ఈ విధంగా దేశమంతా ఫార్వర్డు బ్లాకు నిర్మించబడి పనిచేయ సాగింది. సుభాసబాబు దేశమంతా పర్యటించాడు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్ని బలవంతంగా, ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా యుద్ధం లోకి లాగింది. ప్రభుత్వ చర్యను వ్యతిరేకించాడు సుభాస బాబు. ఆయన అధ్యక్షత క్రింద రాంఘర్‌లో స్థానిక పోరాటాలను, సామ్రాజ్య వ్యతిరేక శక్తులను సంఘటిత పరచి జాతీయ పోరాటాన్ని సాగించాలని తీర్మానించబడింది. మళ్ళీ ఉద్యమం ప్రారంభ మయింది.

యుద్ధమేఘాలు సృష్టించి, యుర్వినెల్ల
ముంచి వైచుచు, భారత భువిని కూడ
దించ యత్నించి నట్టి విదేశ ప్రభుత
దేశ భక్తుల గర్జకు దిమ్మువోయె !

(సుభాస చంద్రుడు, భారతవాణి చెరో వైపునుంచి ప్రవేశిస్తారు)

**సుభాస :**

40 కోట్ల మంది భారతీయులు బ్రిటిష్ సామ్రాజ్య వాదం నుంచి బైటపడితే, ప్రపంచంలో సామ్రాజ్య వాదమే నశించి పోగలదు. ఎన్ని ఆటంబాంబులైనా దాన్ని ఆపలేవు.

**భారతవాణి :**

ఈ ఉద్యమం ఇంత ఉద్ధృతంగానూ కొనసాగితే నీ లక్ష్యం త్వరలోనే సిద్ధిస్తుంది. బాబు ! కాని---

**సుభాస :**

ఆఁ ! ఏమంటున్నావ్ ?

**భారతవాణి :**

దేశంలో నాయకులంతా అరెస్టు అవుతున్నారు. ఆంధ్రలో అన్నపూర్ణయ్య అరెస్టయినాడు. కలకత్తా నడి వీధిలో దాస్యచిహ్నామైన హాల్వెల్ శిలా విగ్రహం వికటాట్టహాసం చేస్తూనే వున్నది.

**సుభాస :**

ఆ దాస్య చిహ్నాన్నీ ఇప్పుడే, నేనే తొలగించి వేస్తాను.

(ప్రజల కేకలు)

హాల్వెల్ విగ్రహాన్ని తొలగించాలి ! తొలగించాలి !

(అందరూ నిష్క్రమిస్తారు)

**నేపథ్యం నుంచి :**

హాల్వెల్ సత్యాగ్రహంలో సుభాస్ అరెస్టయినాడు. ఉద్యమాన్ని తట్టుకోలేక బ్రిటిష్

ప్రభుత్వం విగ్రహాన్ని తొలగించి వేసింది. కాని సుభాస్‌ను విడిచి పెట్టలేదు. బైటనుండి ఉద్యమాన్ని నడిపించవలసిన సమయం అది. విడుదల కోసం ఆయన చేసిన ప్రయత్నమంతా వ్యర్థమయింది.

**రంగ ముఖమున నుండి తీవ్రముగ ఉద్య**
**మమును నడిపించవలసిన మహిత మూర్తి**
**ఊసలను పట్టి తాడించు ! హుంకరించు !**
**గాంధియును బైట లేడంచు కలతపొందు !**

(అంత బద్ధుడైన సుభాస చంద్రుని కడకు భారతవాణి ప్రవేశిస్తుంది)

సుభాస :

అమ్మా ! ఇప్పుడేమిటి కర్తవ్యం !

భారతవాణి :

నిరశన వ్రతం చెయ్యి, ప్రాణాలను బలిపెట్టెయ్యి.

సుభాస :

బానిసగానే చనిపొమ్మంటావా ? స్వాతంత్ర్య సూర్యోదయాన్ని చూచే అదృష్టం నాకులేదా తల్లీ !

భారతవాణి :

సూర్యోదయం అయేది తూర్పున. తూర్పు దిశలో నీరు మేఘాలు ఎలా విడిపోతున్నాయో చూడు.

సుభాస్ :

అక్కడికి దారి ?

భారతవాణి :

నేను చెప్పిందే !

(నిష్క్రమిస్తాడు)

నేపథ్యం నుంచి :

సుభాస్ నిరశన వ్రతం సాగించాడు. ఆరోగ్యం శిథిలమై పోయింది. బ్రిటిష్ ప్రభుత్వం కంగారు పడింది. విడుదల చేసింది. కాని ఆయన గృహం చుట్టూ గట్టి పహారా ఏర్పాటు చేసింది. ఆయన ఇంట్లోనే వుండి పోయాడు. ఎవర్నీ రానిచ్చేవాడుకాడు. భోజనం కూడ బైటనే పెట్టి పోయేవారు. ఆయన ఏకాంతంగా తపస్సులో మునిగిపోయాడు. అంతలో 1941, జనవరి 26వ తేదీన హఠాత్తుగా --

**భరత సింహం, వీర సుభాస బాబు**
**ఉన్న వాడున్న యట్లె అదృశ్యమయ్యె !**
**వేద భారత ఘన తపో విద్య యేమొ !**
**భావి భారత మహాత్మ్య భావమేమొ !**

సుభాస చంద్రుడు కనిపించలేదనే వార్త దేశంమీద పేలింది. బాంబులాగే పేలింది. దేశమంతా భయాందోళనలతో ఊగిపోయింది. సుభాస్ కనిపించడం లేదా ? ఏమైపోయాడు ? భారత మాతృగర్భ ముక్తా ఫలితమైన విప్లవ యోధుడు వీర సుభాస్ ఏమైపోయాడు ? ఆయన ఏమైపోయాడో తర్వాత చాల కాలానికి బెర్లిన్ రేడియో ప్రకటించే వరకు ఎవరికీ తెలియదు.

**దేశమం దుండి సాధించు ఆశలేక**
**మారు వేషాన బైటికి పారిపోయి,**
**"హిందు ఫౌ" జను సేన నిర్మించి, బ్రిటను**
**నదర గొట్టిన నేతాజి కంజలింతు.**

(నేతాజీ దుస్తులతో సుభాస చంద్రబోసు ప్రవేశిస్తాడు అనేక మంది సైనికులతో)

ప్రియమైన భారత దేశం నుంచి ఎలా పారిపోయి రాగలిగానో తరువాత చెపుతాను. కాబూలులోని మిత్రుడు ఉత్తమచంద్ ఆ గాథను క్లుప్తంగా ప్రకటించే వున్నాడు. ప్రస్తుత కర్తవ్యం భారత దాస్యవిముక్తి. ఓ, ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులారా ! మనం వెంటనే బ్రిటనును ఎదిరించి, భారతదేశం జెయిళ్లలో మ్రగ్గుతున్న గాంధీ వంటి దేశభక్తులను, నెహ్రూ వంటి వీరనాయకులను విడుదల చేయవలసి వుంది. వెంటనే ఢిల్లీ పైకి తరలవలసి వుంది. బయలుదేరండి ! ఛలో ఢిల్లీ !

(సైనికులు ఏక కంఠంతో)

ఛలో ఢిల్లీ ! ఛలో ఢిల్లీ !

(అంతా నిష్క్రమిస్తారు)

**నేపథ్యం నుంచి :**

ఆజాద్ హింద్ ఫౌజ్ సేనలు ఢిల్లీ వైపుకు బైలు దేరాయి. ద్వితీయ ప్రపంచ సంగ్రామం మహోద్ధృతంగా సాగుతున్న రోజులవి. ఒక వైపు నుంచి జర్మనీ, ఒక వైపు నుంచి జపాను మిత్రరాజ్యాలను ముప్పుతిప్పలుపెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తున్నాయి. బర్మా కార్యస్థానంగా ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని నెలకొల్పి, దాని అధినేతగా, దాని సర్వసేనాధినేతగా సుభాస్ చంద్రుడు ముందుకు సాగాడు. అప్పటి నుంచే ఆయన నేతాజీగా ప్రసిద్ధుడైనాడు. ఆయన ఆజాద్ హింద్ ఫౌజు సైన్యాలు భారతదేశానికి రాలేకపోయినా ఆయన ఆ తరువాత భారత ప్రజలకు కనిపించకపోయినా, భారతదాస్యవిమోచనకు క్విట్ ఇండియా ఉద్యమంతో పాటు ఆయన మహోద్యమం కూడ ఎక్కువగా తోడ్పడిందనడం అతిశయోక్తికాదు. ఆ మహోద్యమంలో ఆయనకు తోడ్పడిన కెప్టెన్ షా నవాజ్‌ఖాన్, కెప్టెన్ సైగాల్, లెఫ్టినెంట్ ధిలాన్, కల్నల్ లక్ష్మి మొదలైన పెక్కుమంది విప్లవమూర్తులకు స్వతంత్ర భారతం ఎల్లప్పుడూ కృతజ్ఞమై వుంటుంది.

(అప్పుడు ఆనంద విషాదాలతో భారతవాణి ప్రవేశిస్తుంది)

భారతవాణి :

ముందుగా భారతము దాస్యముక్త జేసి
గాంధిజీ పదాబ్జములకు కాన్కజేతు;
ననిన శపథమ్ము నెరవేర్చు కొనియు, కాన్క
బంపి, నీ వాగి పోతివా, బాబు ! మాత
నీ కొరకు వేచియున్న దంతిమ లేక.

(తెర మెల్లగా జారుతుంది)

నేపథ్యం నుంచి :

జనన మాదిగ భారత జనని చరణ
తామరస సేవలో జీవితమును పెట్టి,
వీర విక్రమమోద్యమముల బ్రిటను గుండె
తల్లడమ్ముగ దేశ స్వాతంత్ర్య సిద్ధి
నంది, అజరామరత్వమ్మునందుకొన్న
భరత రత్నమ ! శూర సుభాసు చంద్ర!
వీర నేతాజి ! నీకు జోహారు, బాబు !
నీ జయంతి భారత జయంతి యగు, బాబు !

జైహింద్

# చాండాలిక

## రంగం 1

(ఒక పల్లె సమీపం. దూరంలో గుడిసెలు, ఒక బావి, బావి ప్రక్క ఒకటి రెండు కుండలు, ఒక బండ, బండనానుకుని కాలిబాట. వైశాఖం. మధ్యాహ్నం, నిప్పులు చెరుగుతున్న ఎండ.

ప్రవేశం చాండాలిక, పద్దెనిమిదేళ్లు, వేకువలోని ఎర్రదామర మొగ్గ. విచ్చీవిచ్చని దశ, ఒక చేతిలో చేద.

కాళ్ళు కాలుతున్నాయి. అంగలు వేసుకొంటూ నడిచిందామె. బావిని చేరింది. చెట్టు నీడలో నిలిచింది. చాలీ చాలని నీడ. చుట్టూ ఎండమావులు. బావి ప్రక్క కుండ. కుండపై చేద వుంచింది. ఏదో ఆలోచన. చుట్టూ చూచింది. ఎన్నడూ లేని మండు టెండ ! పండగ జేసుకొంటున్నాడో యేమో సూర్యుడు, పగలబడి నవ్వుతున్నాడు !)

చాండాలిక :

ఏమిటో ఈనాడు తామరల రేడు,
ఎందుకో అంత మీసము త్రిప్పుతున్నాడు !
చీకట్లు కాకులై చింతలలో దాగియును,
ముప్పు గొంతుక బట్టి రొప్పుతున్నాయి.

శత్రు తామసము గెల్చిన లోక బాంధవుడు
సంతృప్తిగనక, పెట్రేగె నేలనొ నేడు !
ఇంకేమి మిగిలెనో? ఇక దేని గాల్చునో ?
ఈ పేట గూడ బూడిద జేసి పోవునో !

పొగలు చిమ్ముచు మండిపోవుచున్నది నేల !
పగలు లోకపు రొమ్ముపై కుంపటయ్యెనే !

అతగాడీ కాట కావచ్చు నిప్పులతో,

అడుగంటిపోవుచున్నది ప్రాణికోటి !

(ఒకొక్క చేదే తోడీ. చుట్టూ వున్న మొక్కలకు చిమ్ముతున్నది. కుండలో ఒక చేద, చెట్లకొక చేద ! దీనంగా చూస్తున్నది వాటి వైపు.)

చాండాలిక :

కన్నబిడ్డల వోలె కరుణతో లోకాల
గావవలసిన రేడె క్రూరుడై చెలరేగ,
ఎన్ని చేదల నీరు సేద దేర్చగ గలదు ?
ఎంత కన్నీరు కష్టము తీర్చ గలదు ?

తల క్రిందులుగ తపము చేసి, చేసి, తపించి
తపసి పక్షులు గడించిన దేమి తుదకు ?
నేలబడిపోవుచున్నవి పండుటాకులై !
నెత్తురులు నించుచున్నవి కనుల మోదుగలు !

మిత్రుడని నమ్మి నీ మృదు కరమ్ముల లోన
మేను వాల్చిన అమాయక లోక మోయి !
చాలు నిక,. నీ కాల్చుకొని తినుట చాలించి,
చల్లగా ఇవె నీళ్ళు త్రావి పోవోయి !

(కుండలోని నీళ్లు దోసెడు తీసి సూర్యుని కేసి చల్లుతుంది. అవి అప్పుడే రంగంలో ప్రవేశించిన ఆనందుడి మీద పడతాయి. అతడు ఉలిక్కిపడి, ఆగి, ఆ చల్లదనానికి సేద దీరి, నిట్టూర్చి, ఒక చెట్టు నీడను నిలుస్తాడు. బాగా ఎండదెబ్బతిన్న బాటసారి. బౌద్ధ సన్యాసి అతడు. పాతికేళ్ళుంటాయి. ఈ సంఘటనకు చాండాలిక నివ్వెరపోతుంది. తాను రమ్మన్న సూర్యుడు వాస్తవంగానే దిగి వచ్చాడనుకొన్నది ముందు. నీళ్లు అతనిపై

పడ్డందుకు నొచ్చుకొన్నది తర్వాత. తోచక, అంజలి ఘటించి నిలబడింది. ఆనందుడి దృష్టి నీళ్ళ మీద వుంది. దోసిలి పట్టాడతడు--)

ఆనందుడు :

ధర్మరూపిణి ! జీవన దాయిని ! నిను
బుద్ధదేవుడు నిత్యము బ్రోచుగాత !
గొంతు ఆర్చుక పోయెను, కొంచెమిట్లు
నీళ్ళు పోయుము, ప్రాణాలు నిల్పు త్వరగ !

(నిజంగా ఆశ్చర్యపోయిందిప్పుడామె ! తాను చండాల కన్య. అంటరానిది ! అతడు బౌద్ధుడు ! ఆ సూర్యుడి కంటె గొప్పవాడు ! అట్టి వాడికి తాను నీళ్ళు పొయ్యడమే? ఎంత పాపం ! పొయ్యకపోతే - అతడు వడగొట్టి ఆ తపసి పిట్టల్లా -- ఆ పైని నూహించలేకపోయింది. వణికి పోయింది. ఉన్నట్టుండి, ఏమిటీ ఉపద్రవం ! అతడు మళ్ళీ అడిగాడు -- )

ఆనందుడు :

నీళ్ళు పోయవా ? ఏల కన్నీళ్ళు నింతు ?
నీళ్ళు నమలుచు ఎందుకు నిల్తు వట్లు ?
ప్రాణములు పోవునేని పాపమగు నీకు;
ఏమి టాలోచనము? పోయవేల నీళ్ళు ?

చాండాలిక :

పోయనా నీళ్ళు ? ఎందుకు పోయనో ప్రభూ ?
నా అసువులే పోయగలను నీ దోసిట్లొ;
కాని -- నా కా యదృష్టములేదు, చండాల
కన్యనోయీ ప్రభూ ! పాపినోయీ ప్రభూ !

ఇది మైల బావి, నే మాల మాదిగ దాన,
ఇవి మైల నీళ్లు, నిను ముట్టు పెట్టును ప్రభూ !
నిన్ను చంపుకొని పాపము కట్టుకొనలేను,
నేరాలు చేసి దుఃఖము పెంచుకోలేను.

ఆనందుడు :

ఏమి టను చుంటివే బాల ? ఎవరు నీకు
మానవతకె వైరుధ్యము మప్పినారు ?
ఆర్తరక్షణ పాపమా ? అంబువులకు
మైలయా ? సాధు జనులు చండాలు రగున ?

నేను మనిషిని, మనిషివి నీవు; మనము
బోధి సత్త్వుని విశ్వైక బుద్ధిజులము;
ఇర్వురము ఒక్కటే భేదమేమి లేదు;
భేద మెంచుట పాపం బెంచుకొనుట.

నీళ్ళు -- ఏ బావి వైనను నీళ్ళు నీళ్ళె;
సేద దేర్చును ఎవరు పోసినను గాని;
నేరముల నేరమౌ ఆత్మనింద మాని,
చేద బట్టుము ! ఆత్మను చేదుకొమ్ము !

(ఆమె కన్నులు మెరిసినై. పెదవి వికసించింది. ముఖం తేజో వంతమైంది. చేద అందుకొని, చేది, ఆనందుని దోసిట్లో నీళ్ళు పోసింది. అతడు గడగడ త్రాగేశాడు. ఎంత దాహం గొన్నాడో ! చేదతో పాటు, తన హృదయాన్ని కూడ దోసిట్లో వంచేసిందామె -- జాలితో ! అతడు సేదదీరి, ఆకాశం కేసి చూసి, బుద్ధం శరణం గచ్ఛామి అనుకొంటూ, ముందుకు సాగిపోబోయి, స్ఫూర్తిగొని ఆగినాడు --)

ఆనందుడు :

నిఖిల జీవనమును నిల్పు నీ కరముల
జీవనము నాకు దయచేసె జీవనమ్ము;
జీవ దుఃఖ తమ స్సూర్యదేవుడైన
శాక్య మునికి నిన్ మించిన సత్య మెవరు ?

నీ కులమ్మున జన్మించి, లోకమెల్ల
పూజగొను అరుంధతి మోద మొసగు నీకు ;
బ్రతుకు ముందుకు నడుపు అబాధితముగ,
గాఢ సంతమసము నుండి గట్టు జేర్పు

బైట వెలు గెంతయున్న లాభమ్ము లేదు,
లోన చీకటియున్న; నీ మానసమ్ము,
దివ్య దీపాలయమ్ముగ తెలిసికొమ్ము,
బైట చీకటియున్నను బాధ లేదు.

మానవుడు బుద్ధుడై, ధర్మ మార్గమందు
సక్తుడై, ఏక సంఘాన స్వస్థుడై, వ
సించు కాలము నిన్ను పూజించ గలదు;
తెలిసికొని నిన్ను నీవు --వర్తింపు, మబల !

(ఆశీర్వాదించి, ముందుకు నడిచిపోతాడు. మంత్ర ముగ్ధ అయిపో యిందామె. కనుమరుగయ్యేంత వరకు అతణ్ని అనుసరించాయి ఆమె చూపులు. తర్వాత అతని అడుగుజాడల్ని ఆరాధించుకొంటూ తిరిగి వచ్చాయి. అతని పాదధూళి తీసుకోలేక పోయింది. పథధూళి తీసుకొని ధరించింది. మత్తుగా ఆ బండమీద కూలబడి, యోచనలో మునిగి పోయింది.)

## రంగం 2

(అదే రంగం. కొంచెం తేడాతో చాండాలిక ప్రవేశిస్తుంది. మొదటి రంగంలో వలెనే ఇప్పుడామె ముఖంలో మెరుపుంది. ఆలోచన వుంది. అన్వేషణ వుంది. మాటి మాటికి దారికేసి, దూరంలోకి పరికిస్తూ వుంది. నీళ్ళు తోడి అటూ ఇటూ చిమ్ముతూ వుంది మధ్య మధ్య.)

చాండాలిక :

మనిషినట నేను ! నా మానసము లోన
మిరుమిట్లు గొల్పినది మెరుపేదో మెరిసి !
ఏమిటో కనిపించి, ఇటె మాయమయ్యె,
మనుషులేనట ఎల్ల మాల మాదిగలు !

చిత్తాన పేరిన చీకట్లు చిలికి,
విజ్ఞాన మను వెల్గు వెన్నను తీసి
కొంచెమైనను నోట ఉంచుకోకుండ
ఎచటికి పోతివో ! ఎందుకో తొంద్ర !

అంటు నీళ్ళను త్రావి, అమృతమే కురిసి,
ప్రవి ననుతీకరించిన ఓ మహాత్మ !
గంగాంబు ధారనై కాచుకొనియుంటి.
వేళ దాటిన గాని వేంచేయ వేల !

(నిన్నటివేళ దాటింది, నిజమే ! ఆనందుడింకా రాలేదు -- ఆ దారికి? ఎందుకు రాలేదో ? వస్తాడో రాడో ! పైకి చూచింది -- సూర్యుని వంక. దారి దూరంలోకి పరికించి, నిట్టూర్చింది.)

చాండాలిక :

మంచి ముత్తెపు చిప్ప మాదిరిగ అందమౌ
చిరుమబ్బు గొడుగు పట్టిరి దూరమందెవరొ !
వచ్చు కాబోలు నా రాజు !
ఆనంద
మిచ్చు కాబోలు ఈ రోజు !

మార్గమ్ము చివరలో, మరము దరిదాపులో,
ధూళి రేగెను ! పాద ధూళి వెన్నెలగాసె !
బైలుదేరెనొ యేమొ రేడు !
అతని
పాదాలు వదల నీ నాడు !

లోకంపు లోతులో, చీకట్ల గుడిసెలో
బూజు పట్టిన వీణ పుణ్యమిక పండునా ?
మేఘాలు కరదు గట్టేనా ?
ఇంక
మేరువులు కరగి పారేనా ?

(మరీ మరీ చూస్తుందటు కేసే. ఆనందుడు వస్తున్నట్టున్నాడు ! వదనంలో ఉత్సాహం వెలిగింది. ఎంతో ఆశగా వొళ్ళంతా కళ్ళుచేసుకొని చూస్తున్నదటుకేసి ! క్రమంగా వికాసం తగ్గిపోయింది. ముఖపద్మం ముడుచుకు పోయింది ! ఎవరూ రావడం లేదా ? అది వట్టి నీడ, గాలి దుమారం మాత్రమేనా ?)

**చాండాలిక :**

**గాలి మాత్రమై ఆశలు**
**ధూళి రేపి పోయెనే ?**

నీద మాత్రమై కోరిక
నిజము గాక పోయెనే ?

క్షణములోన జొన్నచేను
చవిటి నేల యయ్యెనే !
యమున లాగ పొంగిన యెద
యడారియై పోయెనే ?

ఈ యెడారిలో పుట్టిన బావికి
ఇంతకన్న ఎక్కువ లభించదా ?
ఇంత కాలమును ఇంక కుంద జీ
వించి యుండుటే గొప్ప భాగ్యమా ?

తోడుచుంటి, పోయుచుంటి, తరగని
తోయము, ఆయము తరగి పోవగా !
నీ దోసిలిలో వంచిన చేదెదు
నీటికి ముడివడ్డది నా ప్రాణమే !

క్షణం చాలు, క్షణం చాలు
గతిని తెల్ప, బ్రతుకు నిల్ప,
గతిని తెల్పి బ్రతుకు నిల్పి,
కొలుచు కొనగ కలిసి రావె ?

ఎందుకు వచ్చా వీ దారి కసలు ?
ఎందుకు తట్టా వీ బంద నొసలు ?

నిదురిస్తూ పడివున్నది గుండె బండ
కదిపా వెందుకు దాని కోరిక కొసలు ?

అది మేల్కొని, మెత్తనై, తీగ సాగి
ఆశ్రయం కోసం కై సాచగా --
అందక సాగిపోయా వెందుకు ?
సందలడి పోతున్నా, రావా యిక ముందుకు ?

మళ్ళీ నిద్రపోనా ? ప్రభూ !
ప్రొద్దు పొడిచినా చీకటేనా బ్రతుక్కి ?
మేల్కొల్పిన పుణ్యం నీ కేది ?
మేల్కొన్న ఫలితం నా కేది ?

(కాసేపు బండపై విచారిస్తూ కూర్చున్న దామె -- ఇక అతడు రాదన్న నిస్పృహతో, వియోగం అగ్నిలా రగల సాగింది. దహించి వేస్తున్నదది ఆమె హృదయాన్ని.)

చాండాలిక :

నీ విక రావని తెలుసు,
అయినా -- వస్తావేమోనని ఆశ ?
మొన్న రాలేదా ?
అలాగే వస్తావని !
అయినా, ఎందుకు రావాలి నీవు ?
ఎందరో నా వంటి జీవులు --
చేదెడు నీళ్లు నీ దోసిట్లో పోసి తరించాలని
ఏళ్ల కొలదీ ఎదురు చూచే జీవులు !
ఎందరో నా వంటి జీవులు !

అందరినీ మేల్కొల్పాలి నీవు !
అందర్నీ అనుగ్రహించాలి నీవు !
అందరిలో నే నొక్కతిని.
అందులోనూ చాండాలిని !
జగాలు పాలించే ప్రభువ్వు నీవు;
చాండాలిక గుర్తా నీకు ?
నీ విక రావని తెలుసు.
అయినా, వస్తా నేమోనని ఆశ !
గుడిసెకు పోదామని వుంది.
ఈ లోగా వచ్చి పోతావేమోనని భయం !
నిన్ను నే చూడకుండా వచ్చి పోతే --
నన్ను నే చూచుకోలేను తర్వాత.
ఎవరో వస్తున్నాడు !
వస్తున్నావా, ప్రభూ !
వస్తున్నావా, మళ్లీ ఇంత కాలానికి ?

(లేచి ఎదురు నడిచి, కళ్ళు నలుపుకొని, తేరి చూచి, దిగాలుపడి, పడిపోతుంది నేల మీద)

## రంగం 3

(మరి కొంచెం భేదంతో అదే రంగం. సాయంకాలం. మాలి ప్రవేశిస్తుంది. చాండాలిక తల్లి ఆమె. కార్మిక స్త్రీ. పెద్దబొట్టు. వదులుగా దువ్వి జారుముడి వేసుకొన్నది. ప్రసన్న వదనం, తీవ్ర దృక్కులు. ఒక చేతికి గాజులు. ఒక చేతికి జపమాల. ఆ మాల మాదిగ పేటకు రాణివంటిదామె. ఏదో దిగులుగా ఎవరినో వెతుకుతూ వచ్చింది రంగంలోకి. రంగం కొంచెం మసకగా వుంది.)

మాలి :

ఏమైపోయిందో బిడ్డ ?
ఇంకా గుడిసెకు చేరలేదు చీకటి పడ్డా !
అమ్మా !
ఎక్కడున్నావే, తల్లీ ?
ఎందుకు చస్తావే, అలా, కుల్లీ ?
కొంత కాలంగా --
మతి మతిలో లేదు చిట్టికి !
కాలి పోవాలని బుద్ధి పుట్టిందీ కట్టెకి !
ఎన్నాళ్ళ నుంచో ఎదురు చూస్తున్నా నిది.
అప్పటి కయ్యిందీమె ఆడది !
రాజే రమ్మంటే రా నన్నది--
ఏ భగవంతుణ్ని వలచిందో ఇప్పు డిది !
పోనీ-- ఎవడో ఒకడు.
అంతే చాలు--మతి మళ్లింది దీనికి.
అమ్మా !
అమ్మా !

(మాలి ఇటూ అటూ పిలిచింది. ఆ చాటున బండనానుకొని పరధ్యానంలో మునిగిపోయి వున్న చాండాలిక ఉలిక్కిపడి లేచి, తల్లి ఎదటికి వస్తుంది -- మెల్లగా, తలవంచుకొని. ఆమెను దగ్గరగా తీసుకొని పరికించి చూస్తుంది.)

మాలి :

చిక్కిపోయింది బిడ్డ !
మాయదారి పనుల్లో పడి --
చూచుకోలేకపోయా నీ చెడ్డ !
ఏమిటే, తల్లీ ! నీ బెంగ ?
ఎందుకు దాస్తావే నా దగ్గర, దొంగా ?
కాలేక పోయావులే మురా--
ఇప్పు డెవరే నీ మనస్సు దొంగిలించిన దొర ?
రాజు నే తృణీకరించిన నిన్ను
ఇప్పుడిలా చేసిందేమే-- మిన్ను !

చాండాలిక :

నిద్ర పోతున్న పులి పిల్లను
కొట్టుకు పో జూచిన వేటగాడే ఆ రాజు;
యౌవన తైలంలో ఉడికిన గుండె కాయల్ని
అందంలో నంజుకు తింటారే వాళ్లు !
తింటారు వాళ్లు--
తిన నివ్వరు మనల్ని !
ఎందుకే గతం తవ్వుతా విప్పుడు ?
అవుతున్న దేదో చెప్పుడు !
మంచు దిబ్బల యెదారిలో
మణగి పోయిన హిమానీ కుమారిని

తట్టిలేపి, దిక్కు చూపిన
దయా సముద్రుని అడుగుల చప్పుడు !
నా గుండెల్లో--
అదే చప్పుడు !

మాలి :

ఎవరే ఆ దయలేని దయా సముద్రుడు
కిన్నెర వంటి నీ హృదయాన్ని పగిల్చి
దప్పు కట్టి, తిరుగుబాటు
దండోరా పలికిస్తున్న భౌతికుడు ?
మన యింటా, వొంటాలేని అవినయాన్ని
నీలో రగిల్చిన విప్లవకారుడు--
ఎవడే ఆ దొర ?
నీ మనస్సును ఆ కట్టిన ఒర ?

చాండాలిక :

అయ్యో, అనకమ్మా, అలా !
జడమై పడివుండడమేనా వినయం ?
మేల్కొని, తలెత్తి ముందుకు వస్తే
తిరుగు బాటా అది ? నయం !

ఘనీ భూత చైతన్యపు
గడ్డ మంచు మన బ్రతుకు,
ఆత్మ భాను కరచాలన
అవబోధం కావిస్తే--
ఊగి, పొంగి, రేగి, దూకి

ఉరకలతో ప్రవహిస్తే--
విప్లవమైతే కానీ,
విజయ మదే మానవతకు !

మాలి :

మారి పోయావే, తల్లీ !
మంత్రం పెట్టాడే ఎవడో
లేకుంటే ఏమిటి ఆ మాటలు ?
కాకుంటే ఏమిటి ఆ చూపులు ?
ఏ గాలికి కదలని ఈల మొక్కలా
పాటలు  పాడుకొంటూ
కాలం గడిపే నీ ప్రశాంత చిత్తాన్ని
చిగురాకు చేసేశా డెవడో !
ఛిద్రం చేసేశా డెవడో !
పనిపాటలకు చిన్నమై,
ప్రశాంతతకు నిలయమై
బ్రతికే మనం--

భరించలేం ఈ రకం భోగాలను !
కులం కుర్రాణ్నెవణ్నో పెళ్లాడి
కుటుంబాన్ని పెంచుకోక,
కోరికల్ని పెంచుకొని
గుండెదడతో చచ్చిపోయే
భోగులతో మనకు
పోటీ యెందుకే, తల్లీ !

చాండాలిక :

పెళ్ళేమిటే, నా మొఖం పెళ్లి?
పేడపురుగు పెట్టడం లేదటే పిల్లల్ని ?
అతడు చూపిన వెలుగులో చూస్తే
వట్టి గులకరాళ్ళేనే మన వూహ లన్నీ !
ఒకటే నమ్మా నిత్యం --
ఒకటే నమ్మా సత్యం--
అది-- నే నమ్మా "నేను!"
నేను మనిషి నన్నాడే ఆ భిక్షువు !
నన్ను నాకు చూపించాడే ఆ ప్రభువు !
నా చేతి నీళ్లు పుచ్చుకొని--
నాకు అమృతం ఇచ్చాడే ఆ స్వయంభువు !

మాలి :

భిక్షువు ? భిక్షువా ?
అయ్యో, ఎవరే ఆ భిక్షువు ?

చాండాలిక :

అతడేనే, అమ్మా అతడు !
సూర్యుడిలా ప్రకాశిస్తాడు ఎర్రగా.
చంద్రుడిలా నవ్వుతాడు చల్లగా,
ఏదో తీయని బాధలో
హృదయం కాలిపోతూ వుంటే
ఆ మంటలా వుంటా డమ్మా అతడు !
అమాయకంగా కనిపిస్తాడు --
ఆనందంలా వుంటా డతడు;

మనిషిని చేశాడు నన్ను--
మార్గం చూపలేదు నాకు !
అందుకనే వేచి వున్నా నిక్కడ
అతని రాక కోసం--
అతని ఆజ్ఞ కోసం !

మాలి :

నీవు చెప్పేదాన్ని బట్టి చూస్తే
ఆనందుడై వుంటా దతడు !

చాండాలిక :

ఆ పేరే బాగుందమ్మా అతడికి
అతడు కావాలే అమ్మా, నాకు !
కర్మం అంటూ, కాలం అంటూ,
మనుషులమే కా మనుకొంటూ,
ఊరి శివార్లలో
ఊడిగం చేసుకొంటూ
పురుగుల్లా బ్రతికే చండాలుడు కూడా
పూజా పుష్పాలే భగవానుడి కన్నా దతడు !
తరతరాల నైచ్యతమస్సును
తరిమివేశా డొక్క మాట నెరనుతో !
జ్ఞాన జ్యోతి అతడు--
జీవిత భాగ్య విధాత అతడు
అతడు కావాలే అమ్మా నాకు !

మాలి :

సన్యాసి కాదటే, అతడు ?

నీ కెందుకే  అమ్మా, అతడు ?
ఆడవాళ్ళను కన్నెత్తి చూడ దతడు.
అగ్గిలాంటి వాడతడు !
ఎందుకు వస్తాడీ దారి కతడు ?
అయినా, ఎందుకు నీ కతడు ?

చాండాలిక :

ఎందుకో నాకు తెలీదు,
అతడు చెక్కిన శిల్పాన్ని నేను !
అతడే నా ప్రపంచం !
అలా అనిపిస్తున్నది నాకు !
ఆడా, మగా అనేది
అజ్ఞానం కాదటే, అమ్మా ?
అన్నీ వదలిన సన్యాసికి
అలాంటి భేదం లేదమ్మా !
మనిషికి భేదం వుంటే--
మన్నించ బడతాడు అజ్ఞానిగా,
సన్యాసికి భేదం వుంటే--
చస్తాడు నరకంలో మోసగాడుగా,
అత డలాంటి వాడు కాదే అమ్మా!
అతడు నాకు కావాలే అమ్మా !
ఆడదాని శరీరం కాదే కోరేది,
అంతరంగ మేదో వాంఛిస్తున్నది !
మేల్కొన్న మనస్సు దారి తెలియక
గిజగిజ కొట్టుకొంటున్నది !

మాలి :

కొబ్బరి చెట్టెక్కడం
దబ్బ గడ్డి కోసం అంటే
నవ్వులాటలకు కాదు--
నమ్మడానికే నటే, తల్లీ ?
అర్థం కావడంలేదు నీ మాటలు,
అపూర్వంగా వున్నాయి నీ వూహలు !
మునుపటి పిల్లవు కాదు నీవు,
ఏదో తెస్తావు కొంప మీదికి !
నిస్సంగుడా భిక్షువు.
నీ కోసం ఎందుకు వస్తాడు ?
వచ్చీ; నిన్నేం జేసుకుంటాడు ?
భిక్షవా తినదానికి ?
సరే, నీ యిష్టం--
ఎదురు చూడు, ఏంజేస్తాం?
ఎండమావుల కోసం పోయే జీవికి
ఎన్నటికీ లేదు విముక్తి,
వేసవి తెలి మబ్బును చూచి
విత్తనాలు పారపోసుకొన్నావ్ !
ఒక్క చినుకైనా దక్కే అదృష్టం పట్టాలని
దీవిస్తా, అంతే నే చేయగలిగింది.

(మాలి దీనంగా నిష్క్రమిస్తుంది. చాండాలిక ఆ దారివంకే చూస్తూ బండమీద చతికిల పడుతుంది.)

## రంగం 4

(అదే రంగం, కించిద్భేదంతో. మధ్యాహ్నం ఇద్దరు రాజభటులు ప్రవేశిస్తారు. చెరొక వైపునుండి. దేన్నో వెతుక్కుంటూ ఆత్రంగా కనిపిస్తారు. ఇటూ, అటూ పరికిస్తారు. నిరాశతో పెదవి విరిచి చెరో వైపుకు పోతారు. తర్వాత చాండాలిక ప్రవేశిస్తుంది. చిక్కింది, కాని, చక్కగా వుంది పూర్వంకంటే.)

చాండాలిక :

లోకమెల్ల నా వలెనే
లోల నేత్రమా, ప్రభూ ?
ఎవరి కొరకొ వెదకుకొనుట
భువికి తప్పదా, ప్రభూ ?

ప్రకృతిలోని ప్రతిజీవికి
పైనమె పరమార్థమో !
సూర్యునికే నిలువరాని
కార్యమేమొ దిన దినము !
రవికైనా నలిగిన దొక
రాచ బాట కలదు--
శిలనై పడియుంటి నిందు,
చేరదు నా స్వామి !
రాజు వెదకు దేని కొరకొ
రాజ భటుడు వెదకు,
సన్యాసియు వెదకు నేదొ
చాండాలిక వెదకు !
వెదకుటయే బ్రతుకై ఈ
విశ్వమిట్లు సాగు--

సుఖదుఃఖపు టదుగులతో
చూపుమేర లక్ష్యముకై !
నీ లక్ష్యము నేనైతే
నీ విటు వత్తువు కానీ--
నా లక్ష్యము నీవై నపు
డేల వత్తు వీ దారికి ?

(కొంతసేపు ఆలోచిస్తూ కూర్చుని, లేచి)

నేనే బైలుదేరాలి నీ అన్వేషణలో,
ఎందుకో నీ కోసం నా కీ దిగులు ?
బహుశా- అమ్మ చెప్పినట్టు--
స్త్రీ భావం వున్నదేమో అడుగున !
స్త్రీ పురుషుణ్ని ప్రేమించి నట్టు
ప్రేమిస్తున్నా నేమో నిన్ను, ప్రభూ !
స్త్రీ పురుష భావాతీతుడివి నీవు,
సిద్ధుడివి నీవు.
కామ దృష్టి కాదు నాది.
ఒకసారి నిన్ను దర్శించాలి. అంతే;
దర్శించి, నీ కాళ్ళపై పడాలి. అంతే;
పడి, ప్రార్థించాలి నిన్ను, అంతే !
ఏమని ప్రార్థించాలో తెలియదు.
ఎందు కోసమో తెలియదు.
ఏమీ తెలియదు !
వెదకాలి నిన్ను
చూడాలి నిన్ను

తాకాలి నిన్ను
కలిసిపోవాలి నిన్ను--
అదే నా వాంఛ
అదే నాకు పరాసిద్ధి
స్త్రీ భావం వుంటుందా ఇందులో ?
నేను స్త్రీని కనుక --
వుంటే వుంటుంది !
వుంటే యేం ?
ఈ గాఢ వాంఛకు,
గాఢ నిద్రా నంతరం మేల్కొన్నప్పటి
ఈ క్షుద్బాధకు
హృదయాన్ని కాల్చి వేస్తున్న
ఈ మంటకు,
ఈ వేదనకు,
ఈ పరి దేవనకు
అదే కారణం కావచ్చు !
అయితే యేం ?
నీ కోసం--
నీలో నిర్వాణం కోసం--
పురుషుడే స్త్రీ అవుతున్నప్పుడు
స్త్రీ నైన నేను
స్త్రీగానే నిన్నారాధిస్తే యేం ?
నిన్ను దర్శించుకొని,
కర్తవ్యం నేర్చుకొని,
ఆరాధించు కొంటాను నిన్ను !

రావా ఈ దారికి, ప్రభూ ?
మరిచావా నన్ను, ప్రభూ !
నేనే రావాలంటే---
నీ మఠం అగ్నికుండం గద !
నీ మఠానికి మార్గం --- ఒక
వైతరిణీ నది కద !
రాలేను నేను --
రాగలవు నీవు !
ఒక్కసారి రావా, ప్రభూ,

(నిర్వచింపరాని దైన్యస్థితి ఆమెది. అంతలో లోగడ భటులు మరీ ఆత్రంగా ప్రవేశించారు -- అన్వేషణా దృక్కులతో)

మొదటి భటుడు :

దొరకదురా బాబూ , ఇక పిట్ట !
మాడి పోతున్నది నాకు పొట్ట !

రెండవ భటుడు :

పొట్ట కే మొచ్చె లేరా !
పోయినట్టే మన తల లిక !

మొ. భ :

ఔన్రా బాబూ ! కొత్తగా పెళ్ళయినోణ్ణి !
పెందలాడే రమ్మంది - కర్మ !

రెం. భ :

పదిమంది పిల్లలు గలోణ్ణి !
దిక్కులేక చస్తారు వాళ్ళంతా !

అంతా ఒక పిట్ట కోసం !
రాజుగారి ఒక పూట కూర కోసం !
ఒక్క ముద్దలో కూర కోసం --
రెండు తల లెగిరి పోతాయి !
రెండు సంసారాలు నాశమౌతాయి !

(ఈ లోగా వాళ్ళు చాండాలికను చూస్తారు. ఆమె కొంత ఎదరకు వస్తుంది.)

మొ.భ :

మాలి కూతురు కదట్రా అది ?
ఆ మంత్రగత్తె కూతురు కదట్రా అది ?

రెం.భ :

ఔన్రా అదే -- అదే !
ఈ మధ్య
ఎవడో సన్నాసిని వొలిచి
వాడి కోసం
మహా ఇదై పోతున్నదట !

చాండాలిక :

దేన్నో వెతుకుతూ, వేసారారు వీళ్ళు !
పాపం, మంచినీళ్ళు కావాలేమో !
అడగరు వీళ్ళు--
అంటు వీళ్ళకు !
మట్టిని బంగారం చేసే
మహాత్ములు కారు వీళ్లు --

బంగారాన్ని మట్టి చేసే
మానవ నామకులు వీళ్ళు !
అడిగితే పోస్తా నీళ్ళు --
అడిగి అవమానం తెచ్చుకోలే న్నేను.

మొ. భ :

మంత్రగత్తె కాదట్రా మాలి ?
మన పిట్ట నది తెచ్చిపెట్టగలదేమో !
అడగరా బాబూ ! అడుగు !
ఆపద గడిత్తే చాలు
ఏ మాల కూడైతేం ?

రెం. భ :

మంత్రాలకు మాల మాదిగతన మేంట్రా,
నాయాలా !
బేపనయ్యకీ అదే మంత్రం
మాదిగయ్యకీ అదే మంత్రం
బెమ్మ దేవుడి నోటి తుంపర్లే
వీళ్ళ రెండు నోళ్ళలోవీ !
మంత్రాలకి పెట్టింది పేరు
మాలే నట్రా !
మహారాజుకే హడలు ఇదంటే !
చండీ !
ఓ చండీ !
రా అమ్మా, ఇలా !
మీ అమ్మెక్క డుందో కాస్త చెప్పు !

చాండాలిక :

ఎందుకు మా అమ్మ ?
మీకు ?

రెం.భ :

పనుందే -- కొంచెం
పనుంది !

చాండాలిక :

నీళ్ళు తాగితే -- చెపుతా !
ముందు నీళ్ళు తాగితే -- చెపుతా !
మీకు చెప్పవచ్చో, లేదో--
నీళ్ళు తాగితే, చెపుతా !

మొ. భ :

తాగుదాం రా , బాబూ !
తర్వాత బంగారప్పుల్లతో
నాలుక గీసేకు కుందాం !
ప్రాయశ్చిత్తం చేసేసుకుందాం !

చాండాలిక :

తర్వాత బంగారం కత్తితో
పొట్టలో పొడిచేసుకుందురుగాని,
బంగారం లాంటి కట్టెల మీద
పవిత్రంగా కాలిపోదురుగాని --

"స్త్రీ రత్నం దుష్కులాదపి"
అన్న రాజుకు భటులు మీరు,
అడవిలోకి పారిపోయిన కూర పిట్టను
వెదకి పట్టుకు రాకపోతే
పీకలు తీయించే రాజుకు
పనిముట్లు మీరు !
మాడే పొట్టకు
మాలకూడు మంచిదే మీకు !
అపద్ధర్మం మీది !
అంతరాత్మలు లేవు మీకు !
అందుకే -- తాగండి నీళ్లు,
అమ్మ కాళ్ళపై బడి ఆపద గడుపుకోండి !

(ముఖ ముఖాలు చూచుకుంటారు భటులు, నీళ్ళు త్రాగుతూ ఏడుస్తూ. ఆమె పకపకా నవ్వుతుంది.)

## రంగం 5

(అదే రంగం, మరికొంత మార్పుతో, చాండాలిక గుడిసె మరీ దగ్గరగా కనిపిస్తుంది -- మంత్ర వేదికతో సహా, మరీ చిక్కిపోయి, మరీనిర్మలంగా ప్రకాశిస్తున్న చాండాలిక కూర్చుని వుంటుంది బండమీద. దిక్కులు చూస్తూ వుంటుందామె.)

చాండాలిక :

ఎంత నిగ్రహించు కుందామన్నా
మనస్సు--
అదుపులోకి రావడంలేదు !
ఎంత విదలించు కుందమన్నా
తమస్సు --
అంటుకొని వదలడం లేదు !
తన హృదయాన్ని ప్రభుపరం చెయ్యడానికి
తీవ్ర యత్నం చేయాలి పురుషుడు.
యత్నమే అక్కరలేదు స్త్రీకి ?
ఎంతో మందిని ప్రేమిస్తాడు పురుషుడు
ఏకాగ్రం కాలేడతడు ;
ఒక్కడికే అంకితమై పోతుంది స్త్రీ
ఆ ఒక్కచోటే చూస్తుంది దైవాన్ని !
మోక్షం--
కష్టసాధ్యం పురుషుడికి,
సహజసిద్ధం స్త్రీకి !
ఆరాధనలో ఐక్యమైపోతుంది ఆడది.
ఆడదైతేనే గాని ముక్తిలేదు మగవాడికి !
ఎక్కడి వీ వూహలు నాకు ?

అనంత విశ్వంలో ఆడుకొంటున్న
అందమైన భావాలన్నీ
దర్శన మిస్తున్నాయి--
నా మేల్కొన్న చిత్తం కంటికి !
ఆడదై పుట్టిన అదృష్టం నాది !
ఎక్కడ పుడితేనేం ?
ఎందరు ఏమనుకొంటే యేం ?
మేఘమాల మాలది --
మెరుపుతీగ మాదిగది --
వర్షఋతువే మాలమాదిగది --
అయితే యేం ?
లోక జీవన ధాత్రిని
లోకమే అవమానిస్తున్నది !
అయితే యేం?
అర్చనలో--
ఆరాధనలో--
ఐక్యమై పోతాం మేము
ఆనంద బ్రహ్మలో !
నీలోనే ఐక్యమౌతా నేను
నిన్నొక్కసారి చూచి !
ఆనంద బ్రహ్మలోకి
నా కన్ను తెరిచావు నీవు !
అందాలన్నీ అగుపిస్తున్నై నాకు !
కాని---
అవన్నీ నీ రూపం దాలుస్తున్నాయి, ప్రభూ

అందుకే, ప్రభూ---
నిన్ను చూడాలన్న ఆరాటం !
కాల్చివేస్తున్న ఆరాటం !
నిన్ను చూడాలి నేను,
తప్పదు-- చూడాలి !
అలా చూస్తూ
అంతమై పోవాలి !
ఆనందమై పోవాలి !

(ప్రవేశం మాలి. మంత్రశక్తిచే రాజుగారి కూర పిట్టను రప్పించి భటుల ప్రాణాలు కాపాడిన ఉత్సాహంతో వున్నదామె. చాండాలికను చూచి ఆగింది, పలుకరించింది.)

మాలి :

ఇక్కడే కూర్చున్నావటే, తల్లీ, ఇంకా ?
ఇంకా ఎంతకాలమే ఈ నోము ?
బ్రతుకు తెరువు తెలియ కుండా
బ్రతుకంతా ఎదురు చూడ్డమేనా ?
ఏమిటి జ్ఞాపకం నువ్వతడికి ?
ఎందుకు వస్తా డీ దారి కతడు ?
అంత అదృష్టమే వుంటే నీకు--
ఎందుకు పుడతా వీ కులంలో నీవు ?
వదులుకోవే ఆశ ---
పదవే ఇంటికి !

చాండాలిక :

కులాన్ని బట్టి కాదమ్మా అదృష్టం !
మనిషిగా పుట్టడమే ఒక అదృష్టం !

తనను తాను తెలిసికొని
తన్మయమై పోవడమే పరమార్థం !
కుల మేమిటే -- కులం ?
రెండే కులాలు మనిషికి;
పండితుడు, పామరుడు !
పండితుడికి కులం లేదు --
పామరుడే కులమైనా పశువే !
సర్వప్రాణుల్నీ తనకు లాగే చూడనివాడు,
నిత్య సేవా పరతంత్రుడు కానివాడు,
మనిషేమిటే మనిషి !
ఆర్థిక ప్రయోజనం కోసం
అధర్మాన్ని ధర్మంగా శాసించే మనిషి
స్వర్ణ కిరీటంలో ఊరేగవచ్చు ఇక్కడ,
ముళ్ళ కిరీటమేనే అతడి కక్కడ !
ఆనంద ప్రభు కరుణా వీక్షణం
అమృతంలా నన్ను తాకి నప్పటినుంచీ
ఇలాంటి భావాలే వస్తున్నై నాకు !
ఏం చెయ్యనమ్మా నేను ?
అతడి అమృత హస్తమే తాకితే
ఇంకా ఎంత దివ్యంగా ఉంటుందో ?
ఇదంతా నీ కర్థం కాదు గాని--
అతడు తనంతట రాడంటున్నావు కనుక---
ఒక్క సహాయం చేసి పెట్టవే నాకు --

మాలి :

చెప్పమ్మా ! చెప్పు !
నీ కోసం కాదటే నా బ్రతుకంతా ?
నీ వన్నది నిజమే అనిపిస్తున్నది నాకు !
అమాయకులం--
అన్యాయం ఎరగని వాళ్ళం--
అందర్నీ సేవించే వాళ్ళం
స్వార్థం లేని వాళ్ళం
సంతృప్తితో బ్రతికే వాళ్ళం --
ప్రపంచం ఎలా పోయినా
మన బ్రతు కేదో మనం బ్రతికే అనాసక్తులం ---
కేవలం సన్యాసులం---
అమృత లోక మేదైనా వుంటే
మనం గాక మరెవ్వరే అర్హులు దానికి !
నీ వన్నది నిజమే అనిపిస్తున్నాది నాకు !
చెప్పమ్మా చెప్పు !
నీ క్కావలసిందేదో చెప్పు !

చాండాలిక :

మంత్రాలు వచ్చును కాదటే నీకు ?
యంత్రాలు వెయ్యగలవు కాదటే నీవు ?
రాజుగారి వస్తువులే పోతే
రావించి పెట్టావు కాదటే నీవు !
నిన్నగాక మొన్న---
అడవిలోకి పారిపోయిన పిట్టనే
అమాంతం రప్పించి

భటుల ప్రాణం నిల్పావు కాదటే నీవు ?
నా ప్రాణం కూడ
అలానే నిలుపవే , అమ్మా !

(మాలి ఆ మాట వినగానే నిశ్చేష్టురాలవుతుంది, ముఖం వివర్ణమై పోయింది)

మాలి :

ఆఁ !
ఆఁ !
ఏమిటే నీ వుద్దేశం .
పిట్టను రప్పించి నట్టు
ఆనందుని రప్పించ మనేనా ?
వద్దమ్మా అలాంటి కోరిక !
మంత్రం మందబుద్ధికే గాని
మహితాత్ముడికి కాదే, తల్లీ !
జడ ప్రకృతి పైనే గాని,
జ్ఞానిపై పనిచేయదు మంత్రం !
వికల మనస్కతనే గాని
వివేకాన్ని తాకదు మంత్రం !

(హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్లు ఆగి, ఆలోచించి, అంటుంది మాలి)

మాలి :

మోహం పండకుండానే
మొగ్గలోనే తుంచివేయబడ్డ
అదృష్టహీను డానందు డని
అనుకోవడం విన్నా న్నేను !
ఆ దౌర్బల్యం పై మన మంత్రం
దెబ్బ కొట్టగలదేమో చూదాం !

అయినా---
మరోమాటచెపుతున్నాను---
వద్దమ్మా అలాంటి కోరిక !
ప్రేమించిన మహాపురుషుణ్ణి
పీడించడం అన్యాయం తల్లీ !
దారి చూపిన మహాత్ముణ్ణి
దారి తప్పించడం దుర్మార్గం, తల్లీ !
ఆనందుని హృదయంలో
ఆరిని నిప్పొక టున్నా,
ఊది, దాన్ని రగల్చడం
కాదు మనకు ధర్మం !
అయినా -- అప్పు దతడు
నువు కోరే మూర్తిగా వుండడు !

చాండాలిక :

అలా కాదమ్మా ! కాదు !
రాగానే, అతణ్ని కన్నార చూచి
కాళ్లమీదపడి,
అదేశం పొందుతా ! అంతే !
అంతే ! మరేం లేదు !
రప్పించమ్మా ! అతణ్ని !
ఒక్కసారి రప్పించవే అమ్మా !
నా ప్రాణం దక్కించవే అమ్మా !

మాలి :

సరేనమ్మా ! కానీ !
సరే, నీ యిష్టమే ! కానీ !

స్నానం చేసి వస్తాను---
మంత్ర వేదిక సిద్ధం చెయ్ !

(మాలి నిష్క్రమిస్తుంది చాండాలిక ఉత్సాహానికి మేరలేదు. మంత్రవేదిక సర్దుతూ, రంగు ముగ్గులు పెడుతూ, ఆనందంలో మునిగి పోతుందామె.)

చాండాలిక :

వస్తాడు నా రాజు, వస్తాడిక,
వస్తాడు, కోర్కె తీరుస్తాడిక !
రాతి ముక్కను మలచి
రంగు లద్దిన శిల్పి,
మురికిలో వదిలేసి
తిరిగి చూడని చిలిపి !
వస్తాడు నా రాజు, వస్తాడిక,
వస్తాడు, కోర్కె తీరుస్తాడిక !
నిరయ జాడ్యము నుండి
నిద్ర లేపిన సఖుడు,
జ్ఞాన తేజము చూపి
జాడ తెలియని దొంగ
వస్తాడు నా రాజు, వస్తాడిక,
వస్తాడు, కోర్కె తీరుస్తాడిక !
మనిషి నన్న పవిత్ర
మంత్ర మొసగిన ప్రభువు.
మంత్ర సిద్ధికి ముందె
మాయమైన విరాగి !
వస్తాడు నా రాజు, వస్తాడిక,
వస్తాడు, కోర్కె తీరుస్తాడిక !

(అంతలో మాలి మంత్రగత్తె వేషంలో ప్రవేశిస్తుంది. తల విరబోసుకుని, పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకుని, మెడలో రక రకాల పూసల పేరులు ధరించి వుంటుంది. చేతిలో మంత్రదండం వుంది. ఓం--హ్రూం-- అంటూ గర్జిస్తూ వుంది. మంత్ర వేదికపై నీడలు కనిపిస్తాయి. నాట్యం చేస్తూ ఒకొక్క మంత్ర దేవతే వచ్చి పోతూ వుంది. ఒకొక్క మంత్ర దేవతా దీనంగా వంగి నమస్కరించి పోతూ వుంది. ఆనందుడు స్వాధీనం కాలేదు వారికి. మాలికి కోపం వచ్చింది. తన మంత్ర శక్తి వ్యర్థమై పోయింది. మిగిలింది ఒక్కటే. ఆమె హుంకరిస్తూ, మంత్ర దండాన్ని నేలను వేసి కొట్టింది. అది పిడుగులా పేలింది. తక్షణం చాండాలిక వీర తాండవానికి పూనుకొన్నది ! ప్రకృత కల్లోలితమై పోయింది. అప్పుడు-- చీకటి దెయ్యంలాంటి ఒక భయంకర రూపంలో ఆనందుడు మంత్ర వేదిక పైకి వస్తాడు. చూస్తుంది చాండాలిక ! అయ్యో అని మూర్ఛ పోతుంది. క్షణంలో తేరుకొంటుంది. కన్నీటితో తడసిపోతూ, అంజలి ఘటిస్తుంది. ప్రార్థిస్తుంది. ఈ లోపల మాలి ఏమైపోయిందో, లేదు-- మంత్రదండం పేలి నప్పటినుంచీ లేదామె)

చాండాలిక :

ప్రభూ ! ప్రభూ ! ప్రభూ !
క్షమించు ప్రభూ ! ప్రభూ !
స్వార్థం కోసం కాదు
శరరం కోసం కాదు
ఎందుకు పట్టానో ఈ మంకుపట్టు !
ఎందుకు చేశానో ఈ అన్యాయం !
ప్రభూ !
క్షమించు ప్రభూ !
సూర్యతేజస్కుడవు నీవు,
చుట్టుకొన్నాను నిన్ను దుర్దినంలా
ఎత్తుకుంటావు నన్ను

ఆ నీ దివికన్న ఆశతో ?
ఈడ్చుకొచ్చాను నిన్ను,
ఈ నా పంకిలంలోకి !
నీ తేజస్సులో నా అంధకారం పోతుందను కున్నా,
నా అంధకారంలో నీ తేజస్సే పోతుందనుకోలేదు !
నేను నీ కక్కర లేదని తెలిసీ,
బలవంతంగా నైనా
నన్ను నీ కర్పించు కొందామని
ఆశ పడ్డాను, ప్రభూ !
అఘాయిత్యం చేశాను, ప్రభూ !
బాధ పడుతూ బాధ తీర్చుకోవడం
దుఃఖిస్తూ దుఃఖం తీర్చుకోవడం
బాధపడుతూ పరబాధ తీర్చడం
దుఃఖ పడుతూ పరదుఃఖం తీర్చడం
యుగ యుగాలుగా ఎరుగుదుం మేము --
కాని---
ఇదేమిటి ?
ఇది జీవ వ్యథ ?
నీ మూర్తి వైకల్యంలో
నా మూర్తి శిథిలమై పోతున్నది !
నీ ఆత్మ క్షోభలో
నా గుండె పగిలిపోతున్నది !
సర్వప్రజల
సమస్త దుస్థితినీ
దౌర్భాగ్యాన్నీ

దుఃఖాన్నీ
మోహాన్నీ
మృత్యువునూ
దూరీకంరించే
పవిత్రమూర్తీ !
ఇదిగో స్వీకరించు
నా మనస్సును---
నా బుద్ధిని---
నా హృదయాన్ని---
నా చిత్తాన్ని---
నా సమస్తాన్నీ స్వీకరించు !
స్వీకరించి---
స్వస్థుడవు కా !
యథా తథుడవు కా !
తథాగతుడవు కా !
సిద్ధించింది నా కోర్కె !
ఇదే నా కోర్కె !

(పడిపోతుంది -- ఆనందుని పాదాల దగ్గర, రంగం హఠాత్తుగా చీకటై పోతుంది. చాండాలిక శరీరమునుంచి ఒక జ్యోతి ఆనందునిలో ప్రవేశిస్తుంది. భీకరమూర్తి ఆశ్చర్యపోయి, యథా రూపంలో, తేజోమూర్తి అయిన ఆనందుడు ఆవిష్కృతుడౌతాడు. రంగంలో కాంతి ప్రవేశిస్తుంది. అతడు ఆమె శరీరంపై అభయహస్తం వుంచి, ధ్యాన ముద్ర వహిస్తాడు, మెల్లిగా తెరజారుతుంది.)

నేపథ్యంనుంచి :.

జ్ఞాన తేజములో సూర్యుడైనవాడు,
కరుణలో అమృత వారిధుల్ కలుగువాడు,
సత్యమును, ధర్మమును, అహింసయును వాంఛ
లడచు కొనుటయు, సంఘ సౌఖ్య ప్రకృతికి
సాధనములని చెప్పి, ఆచరణ మప్పి,
ధరణిని సముద్ధరించిన పరమ గురుడు,
బుద్ధ భగవానుడే మము బ్రోచుగాక !
ఈమె త్యాగ ఫలమ్ము గ్రహించి ప్రభువు
నేల నిశ్రేయసమ్ము పండించుగాక !

## అంధకారంపై విజయం

(రంగం ప్రాగ్జోతిష పర్వత ప్రాంతం, భారత ఉత్తర సరిహద్దులు, చిమ్మ చీకటి. చీకట్లో ఏవో నీడలు కదులుతున్నై. భీకరాకారాలేవో పరిగెడుతూ, తరుముతూ వున్నై. నేపథ్యంలో నుంచి ఏదో కోలాహలం, కల్లోలం. మధ్య మధ్య ఎఱ్ఱటి మెరుపులు, అరుపులు, ఏడ్పులు. అది అంధకార బంధురమైన నరక రాజ్యం. అవి దాని సరిహద్దులలోని నరక యాతనలు. క్రూర దీన ధ్వనుల నడుమ నేపథ్యం నుంచి పరిస్థితిని వివరించే ఒక పాట వినిపిస్తూ వుంటుంది. తదనుగుణంగా రంగంపై ప్రదర్శన సాగుతుంది.

నేపథ్యం నుంచి :

అంధకారం ! అహంకారం !
గంధకాగ్ని జ్వాలలు !
భరత సుందర నందనముపై
నరక సేనల దాడులు !

నరుని న్యాయపు టెల్ల మీద
నరక దైత్య విజృంభణం !
పాలు త్రాగి -- రొమ్ము గ్రుద్ది
పచ్చి నెత్తురు పీల్చడం !

రోగ కారక విషక్రిమిగా
రోజు రోజుకు పెరిగిపోతూ,
చోటు చాలక, తిండి దొరకక
పేటు రేగిన దురంతరం !

అందినది దిగ మ్రింగుకొంటూ
అసుర మూకలు హద్దు దాటిరి !
మానవత్వపు గుండెలోకి
మారణాస్త్రాల్ పేల్చిరి !

(రంగంలో మసక చీకటి, భయంకరంగా అరుస్తూ ఒక నరక భటుడు ప్రవేశించి, వికట నృత్యం చేస్తూ నిష్క్రమిస్తాడు. చికాకు పరచబడ్డ ఒక దివ్యకాంత అతి దీనంగా ప్రవేశించి, ముందుకు సాగుతుంది.)

నేపథ్యంనుంచి :

మానవత్వపు మేటి విలువలు,
మంచి చెడ్డలు, మంట గలిసె !
ప్రాణదేవత పంచశీలకు
పక్క టెముకలు విరిగెను !

నాగరికత నాశమయ్యెను,
నాల్క సాచెను రక్త దాహం !

తోడి మనుజుని విరుచుకొని తిను
దుర్జనత్వం బలిసెను !

(ఒక నరక సైనికుడు ఆమెను పట్టబోగా, కెవ్వున అరచి ఆమె పారిపోతుంది. అతడు తురుముకొంటూ నిష్క్రమిస్తాడు. తర్వాత సిగరెట్లు పీలుస్తూ నిర్విచారంగా ఒక పిచ్చివాడు ప్రవేశిస్తాడు. బెదురుతూ, ఆ వెన్క ఒక బక్కచిక్కిన యువకుడు వస్తాడు.)

నేపథ్యంనుంచి :

"ఏది నాదీ ? ఏది నీదీ ?
ఎందు కీ సరిహద్దు" లంచును
తమది మొత్తం పరుల కిచ్చి
తాము చచ్చే పిచ్చి వాళ్ళూ---

రౌడి రక్కసి మూక జూచి
రామకృష్ణులు కాక పోగా,
ఎదిరి నిల్చే వీరమతులను
బెదరగొట్టే పిరికివాళ్ళూ---

(వాళ్ళిద్దరూ ఒకర్ని చూచి ఒకరు బెదిరి, లోని అరుపులకు గెంతి, పారిపోతారు. రంగంలో రక్కసి నీడలు తాండవిస్తాయి.)

నేపథ్యంనుంచి :

దొంగమార్కెటు నక్కగాళ్ళూ,
దొల్ల దోపిడి కుక్కగాళ్లూ,
స్వార్థమునకై సొంత జాతిని
వైరి కమ్మే బేరగాళ్ళూ---

పెంచి పెద్దను చేసినట్టి
మంచితనమును త్రుంచినట్టి
సమత సోదరభావ సంపద
సాధుధర్మము మాపినట్టి
కడుపుతప్ప - కడుపుకేదో
కుదుపుతప్ప - ఉన్నతమగు
లక్ష్యమన్నదె యెరుగునట్టి,
లావు దౌష్ట్యం బలిసినట్టి--
నరక రాక్షస దురాక్రమణవు
కరకు కోరలు విక్రమించెను !
భూమిపై గల కంటకత్వం
మొత్తమొక భూతమై నిల్చెను !

(మహా భయంకరమూ, గాఢాంధకార సదృశమూ అయిన నరకాసుర రూపం రంగంపై అవతరిస్తుంది. దాన్ని సిలహావుటులో చూపడం మంచిది.)

నేపథ్యంనుంచి :

సాధు లోకం చచ్చి పోయెనా !
పార మార్థ్యం పారి పోయెనా !
తన కురూపం తానె చూచుక
ధాత్రియే పడి మూర్ఛ పోయెనా !

శాంతి దేవత గుండెపై యొక
శత శతఘ్నులు ప్రేల నుండెను !
నరసమాజం పొలను ముద్దై
నరక క్షుక్షిని చేరనుండెను !

(లోన కోలాహలం పరాకాష్ఠకు పోతుంది. అంతలో రివ్వుమన్న ధ్వనులు, కిరణ బాణాలు రంగాన్ని నింపుతై.)

నేపథ్యంనుంచి :

మానవుడిలో దాగి యుండిన
దానవుడు పెట్రేగి నప్పుడు
మానవుడిలో నిద్రపోయే
మాధవుడు లేచును చివాలున !

ఉమా నాథుని కాట పట్టా
హిమ గిరీంద్రుడు జబ్బ చరిచెను !
రమా నాథుని రూపమున స
ర్వ భారతమును నడుము కట్టెను !
పశులు, పక్షులు, తరులు, వాగులు,
ప్రకృతి మొత్తం తోడురాగా---
నరకు ముట్టడి త్రిప్పి కొట్టగ
ఉరిమి ముందుకు నడిచెను !

(బాణవర్షం కురిపిస్తూ సత్యభామ, కృష్ణుడు ప్రవేశిస్తారు. రాక్షస సేన హాహాకారాలతో పడిపోతూ వుంటుంది. ప్రధాన భూతం విజృంభిస్తుంది.)

నేపథ్యంనుంచి :

ఉపనిషద్ జ్ఞానామృతమ్మును
ఉర్వికంతకు పంచి యిచ్చిన,
ఆర్షభూమిని మనుజు లందరు
ఆది దేవుళ్లే !

యువకు లందరు కృష్ణులే, ప్రతి
యువతి తానొక సత్యభామే !
కోట్ల కొలదిగ లేచి వచ్చిరి.
కృష్ణులును, సత్యల్ !

(రంగంలోకి కృష్ణుడు, సత్య, కృష్ణుడు, సత్యగా -- అనేక మంది యువతీ యువకులు, ఒకరి తరువాత ఒకరు ధనుర్బాణాలతో, యుద్ధ సన్నద్ధులై ప్రవేశించారు. సత్యాకృష్ణులతో రంగం నిండిపోయింది. వారి మకుట రత్న జ్యోతులు అంధకార రాక్షసుని ఛిన్నాభిన్నం చేస్తున్నై.)

నేపథ్యంనుంచి :

ఒకొక యువకుడు ఒకొక కృష్ణుడు !
ఒకొక యువతీ ఒకొక సత్య !
ఒకొక దీపం ఒకొక బాణం !
ఉర్వికే ప్రాణం !

భరత భువిలో ప్రతీ చిత్తం
పరమ నిశితం, పార్థ లక్ష్యం !
ప్రతీ హృదయం దీప హార్మ్యం,
ప్రభాకర తీక్ష్ణం !

నరక దుష్ట దురాక్రమణమును
పెరికి వైచిన బాణ సంచా
అంధతమమును చీల్చి, చెండి,
అణచి పార్వైచెన్ !

నరక దౌష్ట్యం నాశమయ్యెను,
మానవత్వం మరల వెలసెను.
దీప పంక్తులు మాల లయ్యెను
దివికి భువి కొకటన్ !

(చీకటి చెల్లా చెదురై, రంగం దేదీప్యమానమవుతుంది. భారత సరిహద్దులు శత్రు నిర్ముక్తం అయినై. లోకంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిసినై. సత్యా కృష్ణ బృందం రాస నృత్యం చేస్తారు. బాణా సంచా వేడుకలు జరుగుతాయి.)

* * *